నవతెలంగాణ
నమ్మగిన తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
శుక్రవారం | మార్చి 15, 2024 | www.navatelangana.com

మామిడిగూడ హాస్టల్‌లో వైద్యశిబిరం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

మండలంలోని అంకోలి పీహెచ్‌సీ పరిధిలోని మామిడిగూడ బాలికల హాస్టల్‌లో గురువారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. విద్యార్థులకు వివిధ రకాల మందు గోళీలు ఇచ్చామని, ప్రతి ఒక్కరికి రక్త పరీక్షలు నిర్వహించామని ఆరోగ్య పర్యవేక్షకులు బొమ్మెత సుభాష్, ఆరోగ్య సహాయకులు పవర్ ప్రేమ్ సింగ్, ఇందుబాయి తెలిపారు. వైద్య శిబిరంలో ఆశా రుక్మిణిబాయి, ఇన్‌చార్జి హెడ్ మాస్టర్ సుగుణ, హాస్టల్ ఏఎన్ఎం కామేశ్వరి, టీచర్లు ,విద్యార్థులు పాల్గొన్నారు.



ముళ్ల పొదల్లో మగశిశువు

నవతెలంగాణ-తాంసి

అన్ని ప్రేమల కన్నా గొప్పది తల్లి ప్రేమ అనే పదానికి మచ్చ తెచ్చిన సంఘటన గురువారం భీంపూర్ మండలం నిపాని గ్రామంలో చోటు చేసుకుంది. ఓ తల్లి పసికందును ముళ్ల పొదల్లో వదిలి వెళ్లింది. నిపాని గ్రామ సమీపంలో పొదల్లో అప్పుడే పుట్టిన మగ శిశువును గురువారం తెల్లవారుజామున గ్రామానికి చెందిన చాపల్ల గంగమ్మ గుర్తించింది. శిశువు ఏడుపు విని ఆ మహిళ అక్కున చేర్చుకుంది. గ్రామంలోకి తీసుకొచ్చి స్నానం పోసి పాలు తాగించారు. అనంతరం శిశువును పోలీసుల సాయంతో మహిళా, శిశు సంరక్షణ శాఖకు అప్పగించారు.



కమలంలో కల్లోలం..!

- నగేష్‌కు టికెట్ కేటాయించడంతో ఆశావహుల్లో నిరాశ
- ఆ పార్టీ అధిష్టానం వద్ద అసంతృప్తి వ్యక్తం చేసిన నేతలు
- రానున్న ఎన్నికల్లో మద్ధతుపై అనుమానాలు
- బీజేపీలో ఆసక్తికరంగా మారుతున్న పరిణామాలు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

రానున్న లోక్‌సభ ఎన్నికల బరిలో నిలిచేందుకు బీజేపీ సమాయత్తమవుతోంది. ఇందులో భాగంగా రాష్ట్రంలో తొలి విడతలో నలుగురికి టికెట్లు కేటాయించగా.. రెండో దశలో బుధవారం మరో ఆరుగురికి కన్ఫామ్ చేసింది. ఇందులో ఆదిలాబాద్ నుంచి ఆ పార్టీ ఎంపీగా వ్యవహరిస్తున్న సోయం బాపురావుకు టికెట్ కేటాయించలేదు. ఆయన స్థానంలో నాలుగు రోజుల క్రితం బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరిన మాజీ ఎంపీ గోడం నగేష్‌కు టికెట్ కేటాయించింది. ఉమ్మడి జిల్లాకు చెందిన బీజేపీ ఎమ్మెల్యేల మద్దతు ఉండటంతోనే ఆ పార్టీ అధిష్టానం నగేష్ వైపు మొగ్గు చూపించిందని ప్రచారం జరుగుతోంది. నగేష్‌కు టికెట్ రావడంలో ఓ ఎమ్మెల్యే కీలకంగా వ్యవహరించారనే ప్రచారం జరుగుతోంది. దీంతో ఇన్నాండ్లు తనకే టికెట్ వస్తుందనే ధీమాతో ఉన్న సోయం బాపురావుకు ఆ పార్టీ అధిష్టానం షాక్ ఇవ్వడంతో తీవ్ర అసంతృప్తికి గురవుతున్నట్లు తెలుస్తోంది.

లోక్‌సభ ఎన్నికల వేళ కమలం పార్టీలో పరిణామాలు కల్లోలం రేపేలా కనిపిస్తున్నాయి. పార్టీలో కొత్తగా చేరిన మాజీ ఎంపీ గోడం నగేష్‌కు ఆ పార్టీ అధిష్టానం ఎంపీ టికెట్ కేటాయించడంతో ఇన్నాండ్లు ఆశలు పెట్టుకున్న నాయకుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఆ పార్టీ తరపున ప్రస్తుతం సిట్టింగ్ ఎంపీగా వ్యవహరిస్తున్న సోయం బాపురావుకు ఆ పార్టీ అధిష్టానం మొండి చేయి చూపించింది. ఆ పార్టీకి రాష్ట్రంలో నలుగురు సిట్టింగ్ ఎంపీలు ఉండగా ముగ్గురికి మరోసారి టికెట్ కేటాయించింది. కానీ ఆదిలాబాద్ ఎంపీకి మాత్రం నిరాకరించడంతో తీవ్ర నిరాశకు గురైన ఆయన భవిష్యత్తు కార్యాచరణపై సమాలోచనలు చేస్తున్నట్లు తెలిసింది. మరోపక్క ఈ సారి పార్టీ టికెట్ దక్కుతుందని గంపెడాశలు పెట్టుకున్న పలువురు ఆశావహులకు సైతం భంగపాటు ఎదురుకావడంతో నిరాశకు గురవుతున్నారు. పార్టీ జెండా మోసిన వారికి కాకుండా కొత్తగా చేరిన వారికి టికెట్ కేటాయించడం పట్ల ఆ పార్టీ అధిష్టానం వైఖరిని తప్పుపడుతున్నట్లు తెలుస్తోంది. తాజా పరిణామాలు బీజేపీలో ఏ స్థాయికి దారితీస్తాయోనని చర్చ జరుగుతోంది.

ఆశావహుల్లో తీవ్ర నిరాశ..!

బీజేపీకి ఇక్కడ సిట్టింగ్ ఎంపీ సోయం బాపురావు ఉన్నప్పటికీ పలువురు నాయకులు ఈ టికెట్ కోసం ముందు నుంచి తీవ్ర ప్రయత్నాలు చేశారు. ఈ సారి సోయంకు టికెట్ రాదని కొన్ని రోజుల నుంచే విస్తృత ప్రచారం జరగడంతో పలువురు ఆశావహులు టికెట్ కోసం అధిష్టానంపై నమ్మకం పెట్టుకున్నారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి టికెట్ లభించకపోవడంతో బీజేపీలో చేరిన మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు లోక్‌సభ బరిలో నిలవాలని భావించారు. టికెట్ వస్తుందని ధీమాతో ఉన్నారు. ఆయన చేరిక సమయంలోనూ బీజేపీ అధిష్టానం నుంచి ఎంపీ టికెట్ హామీ లభించిందనే ప్రచారం జరిగింది. మరోపక్క, బీజేపీ తరపున ఖానాపూర్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన రాథోడ్ రమేష్ సైతం ఎంపీ టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నించారు. ఇటీవల బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరిన ఆదిలాబాద్ జడ్పీ ఛైర్మెన్ రాథోడ్ జనార్దన్ సైతం టికెట్‌పై ఆశలు పెట్టుకున్నారు. మరోపక్క భైంసా మార్కెట్ కమిటీ ఛైర్మెన్ జాదవ్ రాజేష్‌బాబు సైతం టికెట్‌పై తీవ్రంగా ప్రయత్నించారు. టికెట్ వస్తుందనే ధీమాతో ప్రత్యేకంగా వాహనాలు పెట్టి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. సినీ నటుడు అభినవ్ సర్దార్ లోక్‌సభకు పోటీ చేసేందుకు బీజేపీ టికెట్ ఆశించారు.పార్లమెంటు పరిధిలోని పలు గ్రామాల్లో ప్రచారం సైతం నిర్వహించారు. వీరితో పాటు పలువురు వైద్యులు, ఇతర రంగాలకు చెందిన ప్రముఖులు సైతం టికెట్ ఆశించినప్పటికీ ఆ పార్టీ అధిష్టానం మొండిచేయి చూపించింది. కొత్తగా పార్టీలో చేరిన గోడం నగేష్‌కు టికెట్ కేటాయించడం పట్ల వారంతా తీవ్ర అసంతృప్తికి గురవుతున్నట్లు తెలిసింది. నగేష్‌కు కాకుండా తమలో ఎవరికి టికెట్ ఇచ్చినా పనిచేస్తామని ఆ పార్టీ అధిష్టానం ముఖ్యుల వద్ద చెప్పినప్పటికీ వీరి విజ్ఞప్తిని పట్టించుకోవడం లో ద ని తెలిసింది. దీంతో తదుపరి పరిణామాలు ఎలా ఉంటాయనేది సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

సోయం నిర్ణయంపై ఆసక్తి..!

బీజేపీ టికెట్ దక్కకపోవడంతో ప్రస్తుత ఎంపీ సోయం బాపురావు నిర్ణయంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. బీజేపీలోనే కొనసాగుతారా..పార్టీ మారుతారా అనే చర్చ ఊపందుకుంది. మరోపక్క సీఎం రేవంత్‌రెడ్డితో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని ఆయన కాంగ్రెస్ పార్టీలోకి వెళ్తారని ప్రచారం జరుగుతున్నప్పటికీ ఆయన మాత్రం ఈ విషయమై స్పందించడం లేదు. త్వరలోనే ఆయన ఏదో ఒక నిర్ణయం తీసుకుంటారని రాజకీయవర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

ఆశ్రమ పాఠశాలకు మైక్‌సెట్ వితరణ



నవతెలంగాణ-బేల

ఎంఎ తెలుగు పాఠాలు నేర్చుకున్న క్లాస్‌మెట్స్ గిరిజన చిన్నారుల కోసం దాతలై నిలిచారు. రంగారెడ్డి జిల్లాలో తెలుగు స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న గడ్డం సులోచన, ఆదిలాబాద్ జిల్లా ప్రముఖ కవి, రచయిత డా.ఉదారి నారాయణ ఇద్దరూ కలిసి ఉదారి నారాయణ పనిచేస్తున్న సైద్‌పూర్ గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు మైక్‌సెట్ వితరణ చేశారు. గురువారం పాఠశాలలో మాజీ ఎస్ఎంసీ ఛైర్మెన్ మెంతెం సురేష్ సమక్షంలో ఉదారి నారాయణ ప్రధానోపాధ్యాయులు రూపావత్ గణేష్‌కుమార్‌కు మైక్‌సెట్ అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ గిరిజన చిన్నారులకు ప్రతిరోజు ప్రార్థనకు, సాంస్కృతిక కార్యక్రమాలకు పనికి వచ్చే మైక్‌సెట్ అందించినందుకు ఇద్దరికీ ధన్యవాదాలు తెలిపారు. ఉదారి నాయణను ఈ సందర్భంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, గ్రామ యువకులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణ పనులకు భూమిపూజ



నవతెలంగాణ-బోథ్

మండలంలోని కేశవ్‌గూడ, జైతుగూడలో గురువారం రోడ్ల నిర్మాణ పనులను మార్కెట్ కమిటీ ఛైర్మన్ బొడ్డు గంగారెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్ల నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.7లక్షలు మంజూరు చేసిందన్నారు. ప్రతి మారుమూల గ్రామంలో సిసి రోడ్లు, మురుగు కాలువలు, మంచి నీటి సౌకర్యాన్ని అందించేందుకు కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ పటేల్ కోవ లక్ష్మణ్ పటేల్, మాజీ సర్పంచ్ కిషన్, నాయకులు కాశీరాం, ఇస్రు పటేల్, అబ్రార్, కుర్మే మహేందర్, గాజుల పోతన్న, విజయ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

అదనపు తరగతి గదులకు భూమిపూజ



నవతెలంగాణ-ఖానాపూర్

పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు మండలంలోని పాత ఎల్లాపూర్, మస్కపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలలో నూతన తరగతి గదుల నిర్మాణానికి గురువారం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుకోవడానికి స్థలం సరిపోకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారని, దృష్టిలో పెట్టుకొని పలు పాఠశాలలో కాలేజీలలో నూతన తరగతి గదులకు భూమి పూజ చేశామని తెలిపారు. ప్రతి ఒక్కరు బాగా చదువుకొని తల్లిదండ్రులను మంచి పేరు తీసుకురావాలన్నారు. ఉద్యోగాలు సాధించి తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజూర సత్యం, వైస్ చైర్మన్ కావలి సంతోష్, నాయకులు జన్నరపు శంకర్, నాయిని సంతోష్, పరిమి సురేష్, షబ్బీర్ పాషా, నాయకులు నిమ్మల రమేష్, సలీం ఖాన్, తోట సత్యం, ఆసిఫ్ అలీ పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్ ద్వారా అనుమతిలేని వస్తువులు తరలిస్తే చర్యలు



నవతెలంగాణ-బోథ్

మండలంలోని అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్ ఘన్‌పూర్ ద్వారా అనుమతి లేని వస్తువులు తరలిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ రమేష్ అన్నారు. గురువారం ఎస్పీ ఆదేశాల మేరకు పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ప్రతి వాహనాన్ని క్షుణంగా పరిశీలించాలని అధికారులకు సూచించారు. అనుమతిలేని వస్తువులు తరలించినట్లయితే శాఖ పరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

శ్రామికవర్గ రాజ్య స్థాపన సాధ్యమే

నవతెలంగాణ-నిర్మల్

శ్రామిక వర్గాన్ని దోపిడీ చేస్తున్న తీరును వివరించి శ్రామికవర్గ రాజ్యస్థాపన సాధ్యమేనని కారల్ మార్క్స్ నిరూపించారని సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి ఫసియోద్దీన్ అన్నారు. గురువారం ప్రజాసంఘాల కార్యాలయంలో కారల్ మార్క్స్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రపంచ కార్మికులారా ఏకం కండి, పోరాడితే పోయేదేమీలేదు బానిస సంకెళ్లు తప్ప అని 150 ఏండ్ల కిందటే వెలుగెత్తి చాటిన మహోన్నత వ్యక్తి కారల్‌మార్క్స్ అని కొనియాడారు. కార్మికవర్గం చేతికి శాస్త్రీయ సిద్ధాంతం అందించి, సమాజంలో అసమానతలకు కారణం శ్రమ దోపిడీ అని, దోపిడీని విముక్తి చేస్తే అన్నిరకాల అసమానతల నుండి విముక్తి లభిస్తుందని తెలియజేశారని అన్నారు. మార్క్స్ కన్నా ముందు తత్వవేత్తలు సమాజాన్ని చాలా రకాలుగా అధ్యయనం చేశారని, అధ్యయనం చేయడమే కాదు దాన్ని మార్చాలని చెప్పిన ఏకైక వ్యక్తి మార్క్స్ అని అన్నారు. సమాజ మార్పుకు వర్గపోరాటాలే చోధక శక్తిగా పని చేస్తాయని, పెట్టుబడిదారి వ్యవస్థ అసమానాలతో కూడి



ఉంటుందని అన్నారు. సంపద కొంతమంది దగ్గర పోగుబడి కోట్లాది మంది పేదలు, నిరుపేదలు అవుతారని, మార్క్స్ అన్నారని తెలిపారు. ఆయన చెప్పినట్టే దేశంలో సంపద కొంతమంది చేతిలో పోగుబడుతోందని పేర్కొన్నారు. అంబానీ, అదానీ ఆస్తులు పెరగడం, మరో పక్క పేదరికంలో దేశం 107వ స్థానంలో ఉండటమే ఉదాహరణ అని తెలిపారు. పెట్టుబడిదారి వ్యవస్థలో నూటికి 90 మంది పీడనకు గురవుతున్నారన్నారు. ఈ వ్యవస్థ కూలి కార్మిక వర్గ రాజ్యం రావటం ఖాయమని మార్క్స్ శాస్త్రీయ దృక్పథంతో సిద్ధాంతీకరించారని తెలిపారు. సమాజ అభివృద్ధి కోరుకునే వారు మార్క్స్ చూపిన బాటలో పయనించటమే ఆయనకు నిజమైన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పోశెట్టి, ఆతిక్, మాజిద్, దిగాంబర్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా ఆత్రం సక్కు

- అధికారికంగా ప్రకటించిన ఆ పార్టీ అధినేత కేసీఆర్

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి



లోక్‌సభ బరిలో నిలిచే భారత రాష్ట్ర సమితి(బీఆర్ఎస్) అభ్యర్థిని ఆ పార్టీ అధినేత కేసీఆర్ ప్రకటించారు. ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కును అభ్యర్థిగా ఎంపిక చేస్తూ గురువారం నిర్ణయం తీసుకున్నారు. మధ్యాహ్నం సమయంలో ఆదిలాబాద్ పార్లమెంటు పరిధిలోని ఆ పార్టీ ఎమ్మెల్యేలు, జిల్లా అధ్యక్షులతో పాటు ముఖ్య నాయకులతో హైదరాబాదులో సమావేశం నిర్వహించిన కేసీఆర్ అభ్యర్థి ఎంపికపై చర్చించినట్లు తెలిసింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆసిఫాబాద్ సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న ఆత్రం సక్కును కాదని..జడ్పీ ఛైర్‌పర్సన్‌గా వ్యవహరించిన కోవలక్ష్మికి టికెట్ కేటాయించారు. ఆ సమయంలోనే ఎంపీ అభ్యర్థిగా అవకాశం ఇస్తామని సక్కుకు కేసీఆర్ హామీనిచ్చినట్లు తెలిసింది. తాజాగా పార్టీ అభ్యర్థిని అధికారికంగా ప్రకటించారు. పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో ఆదివాసీల ఓట్లు అధికంగా ఉండటం.. బీజేపీ ఇప్పటికే ఆదివాసీ తెగకు చెందిన మాజీ ఎంపీ గోడం నగేష్‌కు టికెట్ కేటాయించింది. గత లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి పోటీ చేసిన ఆయన తాజాగా కమలం కండువా కప్పుకున్నారు. వెంటనే బీజేపీ అధిష్టానం పార్టీ తరపున పోటీ చేసే లోక్‌సభ అభ్యర్థిగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ సైతం అదే ఆదివాసీ నేతకే ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇక రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ మాత్రం అభ్యర్థి ఎంపికలో ఆచితూచి అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తోంది. 22మంది ఆశావహులు దరఖాస్తులు చేయగా.. ఇందులో నలుగురు అభ్యర్థుల పేర్లపై తీవ్రంగా కసరత్తు చేసినట్లు తెలిసింది. చివరగా ఇందులో అభ్యర్థి ఎవరైతే బాగుంటుందనే కోణంలో సమాలోచనలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఒకటి రెండు రోజుల్లో అభ్యర్థి ఎంపికను ఫైనల్ చేసే అవకాశం ఉందని ఆ పార్టీ వర్గాల ద్వారా తెలిసింది.

న్యాయం చేయాలని రైతుల వినతి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని తమ డబ్బులను సొంత ఖాతాల్లోకి మళ్లించుకున్న తపాలా శాఖాధికారిపై చర్యలు తీసుకోవాలని రైతులు గురువారం తపాలా శాఖ ప్రధాన కార్యాయలం అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ పుష్పెందర్‌కు వినతిపత్రం అందించారు. సీసీఐకి పత్తి విక్రయించిన రైతుల ఆధార్ అనుసంధానం ఉన్న జాబ్‌కార్డు ఖాతాల్లో డబ్బులు జమ అయ్యాయి. తపాలా శాఖ బ్రాంచ్ మేనేజర్ రైతుల డబ్బులను తన ఖాతాలోకి బదలాయించుకున్నాడు. ఇలా రైతుల వద్ద నుంచి సదరు అధికారి దాదాపు రూ.15లక్షల వరకు కాజేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ రూరల్ మండలంలోని బూర్నూర్‌కు చెందిన రైతు మునిగెల సురేష్ మాట్లాడుతూ సీసీఐకి పత్తిని విక్రయించిన డబ్బులు రెండు నెలలు అయిన జమ కాలేదన్నారు. ఈ విషయమైన పోస్టల్ అధికారిని నిలదీయగా రెండు రోజుల్లో వేస్తామని హామీ ఇచ్చారన్నారు. సదరు అధికారి తన ఖాతా నుంచి తీసి రూ.లక్షా60వేలు జమ చేశారని తెలిపారు. బ్రాంచ్ మేనేజర్ డబ్బులు కాజేసినట్టు ఫిర్యాదు వచ్చిందని, ఆదిలాబాద్, జైనథ్, బేల, తలమడుగు మండలాల రైతులు నష్టపోయామని తన దృష్టికి వచ్చిందని సూపరింటెండెంట్ తెలిపారు. విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామన్నారు. తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

యువ రైతు ప్రాణం తీసిన పంట రక్షణ విద్యుత్ తీగ

నవతెలంగాణ-తాంసి



జొన్న పంటను అడవి జంతువుల బారి నుండి కాపాడుకునేందుకు అమర్చిన విద్యుత్ తీగ యువ రైతు ప్రాణాలు తీసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..కప్పర్ల గ్రామానికి చెందిన మల్లెల అక్షయ్(29) తండ్రికి వ్యవసాయ పనుల్లో సాయం చేస్తుంటాడు. గురువారం ఉదయం కూడా తండ్రి పంట పొలంలో ఉండగా అక్షయ్ కూడా జొన్న పంటకు నీళ్లుపెట్టడానికి వెళ్లాడు. అడవి జంతువుల కోసం అమర్చిన విద్యుత్ తీగను తండ్రి తొలగించాడనుకొని వైరు పైనుండి దాటే యత్నంలో కాలుకు వైరు తగలడంతో షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. పొలంలో ఉన్న తండ్రి కొడుకు విగత జీవిగా పడి ఉండడంతో కుప్పకూలిపోయాడు. మృతునికి వారం రోజుల క్రితం కొడుకు జన్మించాడు. చేతికందిన కొడుకు మృతి చెందడంతో కుటుంబీకులు కన్నీటి పర్యంతమయ్యారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. తండ్రి దివాకర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శివరాం తెలిపారు.

ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ భేషరతుగా క్షమాపణ చెప్పాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ భేషరతుగా డా.విశారదన్ మహారాజ్‌కు క్షమాపణ చెప్పాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అగ్గిమల్ల గణేష్ మహారాజ్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్ వద్ద పార్టీ ఆధ్వర్యంలో పీడిత ప్రజల విముక్తి ప్రదాతల జన్మదినోత్సవల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహనీయుల ఆలోచనలను ఆశయాలను బతికించేందుకు ఉద్యమిస్తున్నటువంటి నాయకుడు ధర్మ సమాజ పార్టీ అధ్యక్షులు డాక్టర్ విశారదన్ మహరాజ్ పట్ల బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ వ్యక్తిగతంగా అనుచిత వ్యాఖ్యలు, అసత్య ప్రచారం చేయడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. డాక్టర్ విశారదన్ మహారాజ్‌పై చేసిన అసత్య ప్రచార వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని 48గంటల్లో బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. మహాత్మ జ్యోతిరావు పూలే, అంబేద్కర్, కాన్షీరాం ఆలోచనలను గడపగడపకు తీసుకుపోయే ఎన్నో చైతన్య యాత్రను చేసిన నాయకులను కించపరిచేలా మాట్లాడడం సరైంది కాదన్నారు. అగ్రకుల పార్టీలతో చీకటి ఒప్పందాలు చేసుకుని, బహుజన సమాజాన్ని తప్పుతోవ పట్టిస్తున్న ఆర్ఎస్‌పీ శాశ్వత రాజకీయ సన్యాసాన్ని తీసుకోవాలన్నారు. మార్చి 15 నుండి ఏప్రిల్ 31వరకు రాష్ట్రవ్యాప్తంగా పార్టీ ఆధ్వర్యంలో పీడిత ప్రజల విముక్తి ప్రదాతల జన్మదిన ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలను బహుజనవాదులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలంతా పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా, మండలాల బాధ్యులు బడుగు రాజేశ్వర్, దర్శనాల అశోక్, అగ్గిమల్ల నవీన్, దుమ్మటి సురేష్, సాయికుమార్, రామెల్లి సురేష్, కిరణ్ ఉన్నారు.

ప్రశాంతంగా ముగిసిన ఇంటర్మీడియట్ పరీక్షలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు గురువారంతో ముగిశాయి. ఫిబ్రవరి 28 నుంచి ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు మార్చి 14 వరకు ప్రశాంతంగా జరిగాయి. జిల్లా వ్యాప్తంగా 10,424 మంది విద్యార్థుల కోసం 30 కేంద్రాలను ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. నిమిషం ఆలస్యం నిబంధన కారణంగా అకడక్కడ ఒకరిద్దరు మినహా మిగతా వారు కేంద్రాలకు సమయానికి హాజరయ్యారు. చివరి రోజు పరీక్ష అనంతరం విద్యార్థులు పరీక్ష కేంద్రాల నుండి ఉత్సాహంగా బయటకు వచ్చారు.

16 నుండి మూల్యాంకనం ప్రారంభం

16 నుండి మూల్యాంకనం ప్రారంభమవుతుందని డీఐఈఓ రవీందర్ తెలిపారు. ఇంటర్ పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించామన్నారు. జిల్లాలో 30 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసి విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పర్యవేక్షించామని తెలిపారు. చివరి రోజు పరీక్షకు 8717 మంది విద్యార్థులకుగాను 7892 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
శుక్రవారం | మార్చి 15, 2024 | www.navatelangana.com

నియామక పత్రాలు అందజేసిన ఏఈ సుమన్

నవతెలంగాణ-కడెం



మండలంలోని విద్యుత్ శాఖలో ఇద్దరు జూనియర్ లైన్‌మెన్ గురువారం విధుల్లో చేరారు. వారికి ఏఈ సుమన్ కుమార్ నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఏఈ సుమన్ కుమార్ మాట్లాడుతూ జూనియర్ లైన్‌మెన్ విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని సూచించారు. మండలంలోని ఉడుంపూర్ హెడ్ క్వార్టర్‌లో జూనియర్ లైన్‌మెన్‌గా తిరుపతి, ప్రేమ్ కుమార్ లింగాపూర్ హెడ్ క్వార్టర్‌లో విధులు నిర్వహించనున్నారు.

బార్ అసోసియేషన్‌లో మహిళా దినోత్సవం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గురువారం బార్ కార్యాలయంలో మహిళ న్యాయవాదులు కేక్ చేశారు. అనంతరం మహిళ న్యాయవాదులకు మహిళ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మహిళలను శాలువతో సత్కరించి వారి సేవలను కొనియాడారు. సృష్టికి మూలం స్త్రీ అని వారి సేవలు ఎంతో గొప్పవన్నారు. ప్రతి మహిళను గౌరవించాలని, మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్రాల నగేష్, న్యాయవాదులు పాల్గొన్నారు.

మార్క్స్ చూపిన బాటలో పయనించడమే నిజమైన నివాళి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్
- పార్టీ కార్యాలయంలో కార్ల్ మార్క్స్ వర్ధంతి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కార్మిక వర్గం కార్ల్ మార్క్స్ చూపిన బాటలో పయనించటమే ఆయనకు నిజమైన నివాళని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ అన్నారు. గురువారం కార్మిక వర్గ విముక్తి ప్రధాత, శ్రామిక వర్గం దోపిడీకీ జరుగుతున్న తీరు వివరించి, దోపిడీ వ్యవస్థ నిర్మూలనకు మార్గం చూపిన కారల్ మార్క్స్ 141వ వర్ధంతిని పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ మాట్లాడుతూ ప్రపంచ కార్మికులారా ఏకంకండి పోరాడితే పోయేదేమిలేదు బానిస సంకెళ్లు తప్పా అని 150 ఏండ్ల కిందటే వెలుగెత్తి చాటి, కార్మికవర్గం చేతిలో ఒక వజ్రాయుదంగా కారల్ మార్క్స్ మారాడన్నారు. సమాజంలో అసమానతలకు కారణం శ్రమ దోపిడీ అన్నారు. దోపిడీని విముక్తి చేస్తే అన్నిరకాల అసమానతల నుండీ విముక్తి లభిస్తుందని తెలియజేశారు. మార్క్స్ కన్న ముందు తత్వవేత్తలు సమాజాన్ని చాలారకాలుగా అధ్యయనం చేశారని, అధ్యయనం చేయడమే కాదు దాన్ని మార్చాలని చెప్పిన ఏకైక వ్యక్తి మార్క్స్ అని అన్నారు. మార్పుకు వర్గపోరాటాలే చోధక శక్తిగా పని చేస్తాయని, కార్మిక వర్గానికి కమ్యూనిస్టు పార్టీ అగ్రగామి దళంగా పని చేయాలన్నారు. పెట్టుబడి దారి వ్యవస్థ అసమానాలతో కూడి ఉంటుందని సంపద కొంత మంది దగ్గర పోగుబడి కోట్లాది మంది పేదలు, నిరుపేదలు అవుతారని మార్క్స్ తెలిపినట్లు పేర్కొన్నారు. ఆయన చెప్పినట్టే దేశంలో సంపద కొంతమంది చేతిలో పోగుబడుతుందని చెప్పటానికి తాజా ఉదాహరణ అంబానీ, అదానీ ఆస్తులు పెరగడం, మరో పక్క పేదరికంలో దేశం 107వ స్థానంలో ఉండటమే అన్నారు. దాదాపు 100 కోట్ల మంది ఉండటమే దీనికి నిదర్శనమన్నారు. పెట్టుబడి దారి వ్యవస్థ కూలటం ఖాయమని, కార్మిక వర్గ రాజ్యం రావటం ఖాయం అందుకోసం కమ్యూనిస్టులు ఆయన చూపిన మార్గంలో నడిచి ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు బండి దత్తాత్రి, జిల్లా కమిటీ సభ్యురాలు ఆర్.మంజుల, ఎం.గంగన్న, ఆత్రం కిష్టన్న, సీఐటీయూ నాయకులు అగ్గిమల్ల స్వామి, పండుగ పొచ్చన్న, రమాకాంత్, రమేష్, దేవిదాస్, ఆరిఫా ఉన్నారు.



కేంద్రం ప్రజా వ్యతిరేక విధానాలు మానుకోవాలి

- కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మ దహనం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కేంద్ర ప్రభుత్వం కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని ఐఎఫ్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట నారాయణ అన్నారు. కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చ పిలుపు మేరకు గురువారం తెలంగాణ చౌక్‌లో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ హోరెత్తించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట నారాయణ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. కార్మికులకు వ్యతిరేకంగా తీసుకువచ్చిన నాలుగు లెబర్ కోడ్లను రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలను ఇవ్వాలన్నారు. జాతీయ నూతన విద్యావిదానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుభాష్, నర్సింగ్, దేవిదాస్, హరీష్, గణేష్, కళావతి పాల్గొన్నారు.

ఒత్తిడిని జయించాలి: క్లినికల్ సైకాలజిస్ట్ శ్రీకాంత్

- పరీక్షల సన్నద్ధతపై విద్యార్థులకు అవగాహన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పదో తరగతి పరీక్షలకు సన్నద్ధం అయ్యే విద్యార్థులు ఒత్తిడిని జయించాలని జిల్లా పొగాకు నియంత్రణ విభాగం క్లినికల్ సైకాలజిస్ట్ శ్రీకాంత్ అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ కొలాం ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షల సన్నద్ధతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడిని తట్టుకోవాలంటే పరీక్షల సన్నద్ధతపై స్పష్టత ఉండాలన్నారు. కఠినమైన పాఠ్యాంశాలను చదివేటప్పుడు ఉపాధ్యాయుల సలహాలు తీసుకోవాలని సూచించారు. జీవితంలో ఎదురయ్యే ప్రతి పరీక్ష కఠింగానే కనిపిస్తుందన్నారు. కఠినం అనే ఆలోచన మొదట మన మనసులోంచి తీసెయ్యలన్నారు. మన లక్ష్యంపై స్పష్టత ఉండాలన్నారు. ప్రణాళిక బద్ధమైన సన్నద్ధతతో ఎదైన సాధించవచ్చని తెలిపారు. యోగ, వ్యాయామం, పౌష్టిక ఆహారాన్ని తీసుకోవడం ముఖ్యమన్నారు. మానసిక ఉల్లాసానికి క్రీడలు ఆడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం నారాయణ రావు, సిబ్బంది సురేందర్, మధుకర్, పొగాకు నియంత్రణ విభాగం సోషల్ వర్కర్ చిరంజీవి, విద్యార్థులు పాల్గొన్నారు.

మాటకు కట్టుబడి పని చేస్తున్నాం

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

నవతెలంగాణ-కడెం

కాంగ్రెస్ ఇచ్చిన మాటకు కట్టుబడి పని చేస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. గురువారం కడెం ప్రాజెక్ట్ మరమ్మత్తుల పనులకు భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ తప్పిదం వల్ల కడెం ప్రాజెక్ట్ డేంజర్ జోన్‌లోకి వెళ్ళిందన్నారు. కేటీఆర్‌కు కడెం ప్రాజెక్ట్ ఎక్కడుందో తెలియకపోవడం విడ్డూరమని ఎద్దేవ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి కడెం ప్రాజెక్టుకు రూ.5 కోట్ల 46 లక్షలను మంజూరు చేశారని తెలిపారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డికు నియోజకవర్గ ప్రజల తరుపున కృతజ్ఞతలు తెలియజేశారు. రైతును రాజు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. గతంలో కడెం ప్రాజెక్ట్ సందర్శనకి వచ్చిన తమకు పోలీసులతో అడ్డుకున్నారన్నారు. ప్రాజెక్ట్ మరమ్మత్తుల పనుల కారణంగా ఈసారి క్రాప్ హాలిడేగా ప్రకటిస్తామన్నారు. పార్టీ ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తామని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కు గ్యాస్, రైతుబంధు, ఆరోగ్య ప్రమాద బీమా, ఇందిరమ్మ ఇండ్లు లాంటి పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. కుప్టి ప్రాజెక్టు నిర్మాణ పనులను సైతం త్వరలో చేపడతామన్నారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మూత్రశాలల నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఆంటోనీ అలెగ్జాండర్, మండల అధ్యక్షులు తుమ్మల మల్లేష్ యాదవ్, ఇరిగేషన్ అధికారులు, మాజీ మండల అధ్యక్షులు గొల్ల వెంకటేష్, నిర్మల్ జిల్లా యువజన సంఘం అధ్యక్షులు పొద్దుటూరి సతీష్ రెడ్డి, నిర్మల్ జిల్లా కాంగ్రెస్ మహిళా విభాగం అధ్యక్షురాలు దుర్గ భవాని, అంబారిపేట్ ఎంపీటీసీ కట్ల సింధుజ సాగర్, పట్టణ అధ్యక్షులు వాజీద్ ఖాన్, మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు రహీం, బాబ్లు, పడిగల భూషణ్, తాళ్ళపెల్లి రమేష్, ఇస్రు, రెంకల శ్రీనివాస్, భూమేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల అడ్మిషన్లపై అవగాహన



నవతెలంగాణ-ఉట్నూర్

ప్రభుత్వ డిగ్రీ కళాశాల మొదటి సంవత్సరంలో అడ్మిషన్‌లకు కళాశాల యాజమాన్యం గురువారం మండల కేంద్రంలోని శ్రీ పూలాజీబాబా జూనియర్ కళాశాల, ఏఆర్ఎస్ కళాశాల, చైతన్య జూనియర్ కళాశాలల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, లాల్‌టెక్డి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు కరపత్రాలను పంపిణీ చేసి అవగాహణ కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ స్వామి, తెలుగు ఆధ్యాపకురాలు డాక్టర్ సంగీత మాట్లాడుతూ ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు ముగిసినందున విద్యార్థులకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు పొందాలని సూచించారు. ప్రయివేట్‌కు ధీటుగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బోధన అందిస్తున్నామని తెలిపారు. అడ్మిషన్లు పొందే విద్యార్థులకు బాలబాలికలకు వేరువేరుగా ప్రత్యేక వసతి గృహాలు ఉన్నాయని తెలిపారు. ఈ విద్య సంవత్సరం నుండి కళాశాలలో ఎన్‌సీసీ కూడా వచ్చిందన్నారు. అడ్మిషన్లు పొందే విద్యార్థులు నేరుగా కళాశాలకు వచ్చి సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆధ్యాపకులు డా.శ్రావణి, శ్రీధర దేవి, రవి కిరణ్, రవీందర్, రాజ్‌కుమార్, రాజశేఖర్, శ్రీనివాస్, తిరుపతి, కిషన్, నవీన్, ప్రవీణ్, శంకర్, దేవన్న, జావిద్, సుధాకర్, రాజు, నవీన్, నసీర్, చరణ్, హంసరజ్, నారాయణ, దినేష్, స్వామి ఉన్నారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి



నవతెలంగాణ-బోథ్

గర్భిణులు పోషకాహారంతోపాటు పండ్లు, గుడ్లు, కూరగాయలు తీసుకుంటే ఆరోగ్యానికి మంచిదని ఐసీడీఎస్ సీడీపీఓ సౌందర్య అన్నారు. మండలంలోని సోనాల సెక్టర్ పరిధి దేవాలనాయక్ తండాలో గురువారం పోషణ పక్ష వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింత, కిశోర బాలికలు పండ్లు గుడ్లు ఆకుకూరలు పాలు తీసుకోవాలన్నారు. అనంతరం 11 మంది గర్భిణీలకు శ్రీమంత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ విమల, అంగన్‌వాడీ టీచర్లు నబిత, కమల, లక్ష్మీ, రేణుక, కవిత, సుభద్ర, సురేఖ, లలిత, గీత, శ్రీదేవి, శోభ, ద్రౌపతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



కేజీబీవీ భవనానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రామారావ్ పటేల్

నవతెలంగాణ-ముథోల్

పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పొద్దు తిరుగుడు కొనుగోలు కేంద్రాలను మండల రైతులు సద్వినియోగం చేసుకోవాలని ముథోల్ ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ కోరారు. మండలంలోని బోరిగాం గ్రామంలో ఏర్పాటు చేసిన పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పొద్దు తిరుగుడు క్వింటాల్‌కు రూ.6,760 ధరను ప్రభుత్వం చెల్లిస్తుందని తెలిపారు. రైతులు దళారులకు అమ్మి మోసపోవద్దని సూచించారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లో తాము పండించిన పంటలను విక్రయించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ముథోల్ నుండి విట్టోలి వయా బోరిగాం మీదుగా డబుల్ రోడ్డుకు కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. ఈ రోడ్డుతో రవాణా సౌకర్యం మరింత మెరుగుపడనుందన్నారు. కాళేశ్వరం 28 ప్యాకేజీ పనులను త్వరలో ప్రారంభమయ్యే విధంగా చూస్తానని హామీని ఇచ్చారు. గత పాలకుల నిర్లక్ష్యంతో విద్య, ఇరిగేషన్ వెనుకబడి ఉందని ఆరోపించారు. తాను ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుండి విద్య, వైద్యం, ఇరిగేషన్‌కు పెద్ద పీట వేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డీఎం ప్రవీణ్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ తీగల వెంకటేష్ గౌడ్, మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ గంగ చరణ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ సాయిరాం, సీఈఓ సాయరెడ్డి, డైరెక్టర్లు ధర్మపురి సుదర్శన్, సురేందర్ రెడ్డి, నాయకులు నర్సగౌడ్, కిష్టయ్య, కేశన్న, దేవన్న, లక్ష్మణ్, బోజన్న, రైతులు పాల్గొన్నారు.

కేజీబీవీ భవన నిర్మాణానికి భూమిపూజ

ప్రభుత్వ విద్య సంస్థల్లో మౌళిక వసతులు కల్పించేలా తన వంతుగా పూర్తి కృషి చేస్తానని ఎమ్మెల్యే పవర్ రామారావ్ పటేల్ అన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల జూనియర్ కళాశాల నూతన భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కస్తూర్బా గాంధీ బాలికల కళాశాల నిర్మాణానికి ప్రభుత్వం రూ.2.30 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానన్నారు. తాను ఎమ్మెల్యే గెలిచినప్పటి నుండి నియోజక వర్గం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. ఈకార్యక్రమంలో డీఈఓ రవీందర్ రెడ్డి, ఎంఈఓ మైసాజీ, ఎస్ఓ ఫరానా బేగం, బీజేపీ మండల అధ్యక్షుడు కోరిపోతన్న, ఎంపీటీసీ దేవోజి భుమెష్, నాయకులు నర్సాగౌడ్, ధర్మపురి సుదర్శన్, తాటివర్ రమేష్, సప్పటోల్ల పోతన్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన ఇంటర్ పరీక్షలు



నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో ఫిబ్రవరి 28 నుంచి ప్రారంభమైన ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు గురువారంతో ప్రశాంతంగా ముగిసాయి. ఇంటర్ ఫస్ట్ సెకండ్ ఇయర్‌లో కలిపి మొత్తం 470 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్లు సీఎస్ వెంకటరమణ, డీఓ సువర్ణ, కళాశాల ఇన్‌చార్జి కాంబ్లే బాలాజీ తెలిపారు.

ఘనంగా వీడ్కోలు వేడుకలు



నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో గురువారం పదవ తరగతి విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు వీడ్కోలు వేడుకలు నిర్వహించారు. విందు ఏర్పాటు చేసుకొని విద్యార్థులు కలిసి భోజనాలు చేశారు. ఆటపాటలతో నృత్యాలతో అలరించారు. ఉపాధ్యాయులు పరీక్షల గురించి తగిన సూచనలు చేశారు. కష్టపడి చదివి భవిష్యత్తులో గొప్ప స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఇందులో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు హరిప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మారుమూల గ్రామాలకు ఫలాలు : ఎమ్మెల్యే పాయల శంకర్



నవ తెలంగాణ-బేల

మారుమూల గ్రామాల్లో కూడా అభివృద్ధి ఫలాలు అందాలన్నదే బీజేపీ లక్ష్యమని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. గురువారం మండలంలోని మనియార్ పూర్, దహెగావ్ గ్రామాల మధ్యలో గల వాగుపై హై లెవెల్ బ్రిడ్జి పనులకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని దహెగావ్, మనియార్ పూర్ గ్రామాల మధ్య ఉన్న వాగు వర్షాకాలంలో ఉప్పొంగి ఇతర ప్రాంతాల నుండి వేరు చేస్తుందన్నారు. అత్యవసర సమయాల్లో ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. హై లెవెల్ వంతెన కోసం రూ. 7.10 కోట్లు మంజూరు చేసి పనులను ప్రారంభించామని తెలిపారు. బేల మండలంలోని కాప్రి నుండి మెయిన్ రోడ్డు వరకు రోడ్డు విస్తరణ కోసం రూ.60 కోట్ల నిధులు అవసముండగా కేంద్ర ప్రభుత్వం నుండి రూ.25 కోట్లు మొదటి విడతగా మంజూరు చేయించామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు దత్త నిక్కం, మురళీధర్ రాక్రె, కాంగ్రెస్ నాయకులు ఫైజుల్లా ఖాన్, సామ రూపేష్ రెడ్డి కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పబ్లిక్ స్కూల్‌కు గిరిజన విద్యార్థుల ఎంపిక

నవతెలంగాణ-ఉట్నూర్

2024-25 సంవత్సరానికి హైదరాబాద్‌లోని బేగంపేట్, రామంతపూర్ పబ్లిక్ స్కూల్ ఒకటో తరగతిలో ఆరుగురు గిరిజన విద్యార్థులు ఎంపికైనట్టు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కుష్బుగుప్తా తెలిపారు. గురువారం ఐటీడీఏ కార్యాలయంలో తల్లిదండ్రుల సమక్షంలో లక్కీ డ్రా నిర్వహించారు. ఇందులో సిడం అన్వేషిత, సెడ్మాకి సాహర్ష, రాథోడ్ ఉనతి, కుమ్ర అవినాష్, కొడప తేజశ్, సూర్యభాన్ ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో డీడీ దిలీప్ కుమార్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఒత్తిడికి గురి కాకుండా పరీక్షలు రాయలి



నవతెలంగాణ-ఉట్నూర్

పదో తరగతి విద్యార్థులు ఒత్తిడికి గురి కాకుండా పరీక్షలు రాయలని ఆర్ఆర్ఆర్ ట్రస్ట్ చైర్మెన్ జాదవ్ రాజేష్ అన్నారు. గురువారం పట్టణంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల లక్కారంలో పదవ తరగతి విద్యార్థులకు ప్యాడ్,పెన్సిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురి కాకుండా ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాసి మంచి జీపీఏ సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఆశన్న, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం కుమార్ జాదవ్, టీటీఎఫ్ సంఘం జిల్లా అధ్యక్షుడు జాదవ్ రవీందర్, కుమ్మర శ్రీనివాస్, ఉపాధ్యాయులు శ్యామల్, వీరయ్య, రవి చందర్, ప్రకాష్, పద్మలత, అమృత రావు విద్యార్థులున్నారు.

బీఆర్ఎస్‌కు మాజీ ఎంపీపీ రాజీనామా

నవతెలంగాణ-ఆసిఫాబాద్



మాజీ ఎంపీపీ, బీఆర్ఎస్ నాయకుడు బాలేశ్వర్ గౌడ్ ఆ పార్టీకి రాజీనామా చేసి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా కేంద్రానికి శుక్రవారం మంత్రులు రానున్న నేపథ్యంలో వారి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మసాదే చరణ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మునీర్ అహ్మద్, మాజీ ఎంపీటీసీ సిడాం తిరుపతి, మాజీ కో-ఆప్షన్ మెంబర్ షేక్ అసద్ పాల్గొన్నారు.

పాఠశాలకు మార్చ్‌ఫాస్ట్ బ్యాండ్ విరాళం

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లా కేంద్రంలోని అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలకు విద్యా భారతి బలగం సొసైటీ తాండూర్ వారు మార్చ్ ఫాస్ట్ బ్యాండ్‌ను విరాళంగా జిల్లా విద్యాధికారి పార్సి అశోక్‌కు అందజేశారు. ఈ సందర్భంగా విద్యాధికారి మాట్లాడుతూ రూ.9500 విలువ గల బ్యాండు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. సొసైటీ గతంలో కూడా పాఠశాలకు విరాళం అందజేశారని గుర్తు చేశారు. సొసైటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వ్యవస్థాపకులు సురభి ఆగమరావు, గౌరవ అధ్యక్షులు పెండ్యాల రాధాకృష్ణ, కార్యదర్శి తొగరు శ్రీనివాస్, జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ ఉప్పులేటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాధితులకు అనునిత్యం బాసటగా నిలవాలి

- ఎస్పీ సురేష్ కుమార్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

సమాజంలోని వివిధ రకాలుగా వంచించబడిన బాధితులకు అనునిత్యం బాసటగా ఉండాలని ఎస్పీ సురేష్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన భరోసా సెంటర్‌ను గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల భద్రతకు భరోసానిస్తూ, మహిళలు, పిల్లల సమస్యల తక్షణ పరిష్కారం చూపటమే లక్ష్యంగా ఈ భరోసా సెంటర్ ఏర్పాటైందన్నారు. బాధితులకు సత్వర న్యాయం చేసే దిశగా పనిచేయాలని భరోసా సెంటర్ సిబ్బందికి తెలిపారు. బాధితుల నుండి అందిన ఫిర్యాదు వెంటనే పరిశీలించి సత్వర సేవలు అందించాలన్నారు. అనంతరం సంబంధిత రికార్డ్స్‌ను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ప్రభాకర్ రావు, టాస్క్‌ఫోర్స్ స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్ రాణాప్రతాప్, డీసీఆర్‌బీ ఇన్స్‌పెక్టర్ రమేష్, భరోసా సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలి

- డీఎల్‌పీఓ సురేష్‌బాబు



నవతెలంగాణ-సిర్పూర్(టి)

గ్రామాల్లో అభివృద్ధి పనులను సకాలంలో నిర్వహించాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నీటి కొరతను, ఉపాధిహామీలో ప్రతి ఒక్కరికి ఉపాధి కల్పించాలని డీఎల్‌పీఓ సురేష్‌బాబు అన్నారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో ప్రతి గ్రామంలో వంద మందిపైగా కూలీలకు పని కల్పించాలని, గ్రామాల్లో నిర్వహించే నర్సరీలకు ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని నీటిని, షెడ్లు, అలాగే ఎస్‌బీఎం పేమెంట్‌లను, ఉపాధిహామీలో వచ్చే కూలీలకు తప్పనిసరిగా మాస్టర్ వేయాలన్నారు. ఇంటి పన్నులను వసూలు చేయాలన్నారు. పని చేయని బోర్లను గుర్తించి వాటిని మరమ్మత్తులు చేయించాలని, నూతనంగా వచ్చిన ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన అర్హులైన వారితో నమోదు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యనారాయణ, ఇన్‌చార్జి ఎంపీఓ కృష్ణమూర్తి, ఏపీఓ చంద్రయ్య, పంచాయతీ సెక్రటరీలు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

ఏప్రిల్ 7 వరకు రబీ పంటకు నీటి విడుదల

నవతెలంగాణ-ఆసిఫాబాద్

గత జనవరి నెలలో నిర్వహించిన వారబందీ ప్రకారం జనవరి 7 నుండి ఏప్రిల్ 7 వరకు రబీ పంట కోసం సాగునీటి విడుదల చేయడం జరుగుతుందని వట్టివాగు ప్రాజెక్ట్ ఏఈ షేక్ జానీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాగు నీరు వారబంది ప్రణాళిక ప్రకారం ఏప్రిల్ 7వ తేదీన (90 రోజులు పిదప) సాగు నీటి పంపిణీ ఆపివేయడం జరుగుతుందని, ఆయకట్టుదారులు ఈ విషయాన్ని గమనించి తదనుకూలంగా పొదుపుగా సాగునీటి వినియోగం చేసి తమ పంటలను కాపాడుకోవాలన్నారు.

బదిలీపై వెళ్లిన ఏపీఓకు సన్మానం



నవతెలంగాణ-సిర్పూర్(టి)

సిర్పూర్ మండల ఉపాధిహామీ చట్టంలో ఏపీఓగా విధులు నిర్వహించిన రామ్మోహన్ రెబ్బెన మండలానికి డిప్యూటేషన్‌పై వెళ్లారు. బెజ్జూరు మండలం నుండి నూతనంగా డిప్యూటేషన్‌పై చంద్రయ్య వచ్చారు. ఈ సందర్భంగా డిప్యూటేషన్‌పై వెళ్తున్న ఏపీఓను డీఎల్‌పీఓ సురేష్‌బాబు, ఎంపీడీఓ సత్యనారాయణ శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ఉపాధిహామీ చట్టంలో సేవలందించారని, ఇలాగే విధుల్లో మరిన్ని సేవలందించాలని ఆకాంక్షించారు.

నేడు జిల్లా కేంద్రానికి మంత్రి సీతక్క

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రానికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటిపారుదల, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) శుక్రవారం రానున్నారని పర్సనల్ అసిస్టెంట్ టు మినిస్టర్ సతీష్ బండారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఉదయం 7.15 గంటలకు జిల్లా కేంద్రంలోని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయాన్ని ప్రారంభిస్తారని, 7.45 గంటలకు గుండి పెద్ద వాగు వంతెనను పరిశీలించి 9 గంటలకు కెరమెరి మండలం జోడేఘాట్‌లోని కుమురం భీం గిరిజన మ్యూజియంను సందర్శిస్తారని తెలిపారు. జిల్లా ప్రభుత్వ శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలతో సిద్ధంగా ఉండాలని తెలిపారు.

గ్రంథాలయ భవనాన్ని ప్రారంభానికి సిద్ధం చేయాలి

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన జిల్లా గ్రంథాలయ భవనాన్ని శుక్రవారం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటిపారుదల, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) ప్రారంభించనున్నందున అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని నూతన గ్రంథాలయ భవనాన్ని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర మంత్రిచే నేడు ప్రారంభించనున్న జిల్లా గ్రంథాలయ భవనానికి సంబంధించి ఏవైనా పనులు మిగిలి ఉంటు వెంటనే పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. జిల్లా గ్రంథాలయ భవనంలో పాఠకుల కోసం ఏర్పాటు చేసిన రీడింగ్, రైటింగ్ కుర్చీలు, టేబుల్‌లనుబపరిశీలించి పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే నిరుద్యోగ యువతకు అవసరమైన పుస్తకాలను ఉంచాలని ఆదేశించారు. అదే విధంగా గ్రంథాలయంలో తాగునీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ పీడీ సురేందర్, ఆసిఫాబాద్ మున్సిపల్ కమిషనర్ భుజంగరావు, ఇంజనీరింగ్ అధికారులు, గ్రంథాలయ అధికారులు పాల్గొన్నారు.

అధిక సాంద్రతలో పత్తి సాగుపై అవగాహన కలిగి ఉండాలి

- కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా.శివకృష్ణ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

అధిక సాంద్రతలో పత్తి సాగుపై అధికారులు, రైతులు అవగాహన కలిగి ఉండాలని కృషి విజ్ఞాన కేంద్రం బెల్లంపల్లి ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా.శివకృష్ణ అన్నారు. జిల్లా కేంద్రంలోని జనకాపూర్ రైతు వేదికలో కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సిర్పూర్(యు) డివిజన్ పరిధిలోని సహాయ వ్యవసాయ సంచాలకులు మండల వ్యవసాయ అధికారులకు పత్తి సాగుపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో ఆయన పాల్గొని పలు విషయాలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక సాంద్రతలో పత్తి సాగుపై అవగాహన కలిగి ఉండాలన్నారు. గత సంవత్సరం జాతీయ పత్తి పరిశోధనా కేంద్రం, నాగపూర్ సహకారంతో మంచిర్యాల జిల్లాలో 165 ఎకరాలలో అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేయటం జరిగిందన్నారు. ముఖ్యంగా నేల రకాలు, విత్తన మోతాదు, విత్తే దూరం, మొక్కల సంఖ్య, అందుబాటులో ఉన్న రకాలు, పెరుగుదలను నియంతించే ఉత్ప్రేరకాల వాడకం, పోషకాల యాజమాన్యం, కలుపు, చీడపీడల యాజమాన్యంపైన అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో యాసంగి వరి పంటలో సల్ఫైడ్ దుష్ప్రభావం, జింకు లోపం, కాండం తొలుచు పురుగు ఉనికిని గుర్తించామని దీనికి సరైన సమయంలో జాగ్రత్తలు తీసుకోకపోతే దిగుబడులు గణనీయంగా తగ్గే అవకాశం ఉందన్నారు. సీనియర్ శాస్త్రవేత్త, అధిపతి డా.శ్రీధర్ సిద్ధి మాట్లాడుతూ వరి సాగుచేసే రైతులు రకాల ఎంపికలో జాగ్రత్తలు వహించాలని, పంటకాలాన్ని బట్టి మొక్కల సాంద్రత సరిగ్గా ఉండేలా దగ్గర దగ్గరగా నాటుకోవాలని సూచించారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం జగిత్యాల మృత్తికా శాస్త్రవేత్త డా. రవి కుమార్ మాట్లాడుతూ యాసంగిలో వరి పంటసాగు చేసే రైతులు జింక్ లోపం సల్ఫయిడ్ దుష్ప్రభావం పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస రావు మాట్లాడుతూ అధిక సాంద్రత పత్తి సాగుపైన ప్రతి ఒక్క అధికారి అవగాహన పెంచుకోవాలని, సాగు విధానంపై దృష్టి సారించి అధిక విస్తీర్ణంలో సాగు చేసేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డా. తిరుపతి, నాగరాజు, మండల వ్యవసాయ అధికారిణి మంజుల, విస్తరణ అధికారి రాకేష్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లాలో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు గురువారంతో ముగిశాయి. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి నైతం శంకర్ తెలిపిన వివరాల ప్రకారం జిల్లాలో చివరి రోజు ద్వితీయ సంవత్సరం రసాయన శాస్త్రం కామర్స్ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. దీనితోపాటు ఒకేషనల్ బ్రిడ్జి కోర్స్ కూడా కొనసాగిందన్నారు. జిల్లాలో 19 సెంటర్లలో 4570 మంది పరీక్ష రాయాల్సి ఉండగా, 4416 మంది పరీక్ష రాసినట్లు, 154 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. వీరిలో జనరల్ విద్యార్థులు 4022 మంది ఉండగా, 3900 మంది హాజరు కాగా, 122 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ కోర్సులో 548 మందికి, 516 మంది హాజరు కాగా 32 మంది గైర్హాజరయ్యారు. జిల్లాలో ఎటువంటి మాస్ కాపీయింగ్ కేసులు నమోదు కాలేదన్నారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించడానికి కృషి చేసిన సిబ్బందిని అభినందించారు. చివరి రోజు పలుసెంటర్లను ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది తనిఖీ చేశారన్నారు. శుక్ర, శనివారాల్లో ఒకేషనల్ విద్యార్థులకు బ్రిడ్జి కోర్స్ పరీక్ష జరుగుతుందని తెలిపారు. చివరి రోజు పరీక్ష ముగిసిన తర్వాత విద్యార్థులు గంతులేస్తూ ఇండ్లలోకి వెళ్లడం కనిపించింది.

వాంకిడి : మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు కళాశాల ప్రిన్సిపల్ సంపత్‌కుమార్ తెలిపారు. విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణులు కావాలని ఆయన కోరారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

పండగలను ప్రశాంతంగా జరుపుకోవాలి

- జిల్లా రెవెన్యూ అధికారి లోకేశ్వర్ రావు





నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో అన్ని పండుగలను మతసామరస్యంతో ప్రశాంతంగా జరుపుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి లోకేశ్వర్ రావు అన్నారు. గురువారం జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి గౌడ్, ఆసిఫాబాద్ డీఎస్పీ సదయ్య, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ మున్సిపల్ కమిషనర్లు భుజంగరావు, అంజయ్యలతో కలిసి ముస్లిం మత పెద్దలు, మసీద్ కమిటీ సభ్యులతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసం ప్రారంభమైనందున ప్రజలందరూ మత సామర్యంతో పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని మసీదుల వద్ద పారిశుధ్యం, విద్యుత్ సరఫరా, తాగునీరు సౌకర్యాలు కల్పించాలని, మసీదుల వద్ద ప్రార్థన సమయంలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. మున్సిపాలిటీలు, మండల కేంద్రాలలో మసీద్‌ల వద్ద పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా ఉండేలా సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని, నిరంతరాయంగా విద్యుత్ సరఫరాతో పాటు తాగునీటి ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. సాయంత్రం వేళ ప్రార్థన సమయంలో పెట్రోలింగ్ నిర్వహించేలా పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని, శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలుగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి సజీవన్, ఆసిఫాబాద్ తహసీల్దార్ శ్రీనివాస్ రావు, ముస్లిం మత పెద్దలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఇద్దరు అటవీ శాఖ అధికారుల సస్పెండ్

నవతెలంగాణ-వాంకిడి

ముగ్గురిని చితకబది రూ. 40 వేలు డిమాండ్ చేసిన ఘటనలో ఇద్దరు అటవీ శాఖ అధికారులు సస్పెండ్ అయ్యారు. మండలంలోని కోమటిగూడ గ్రామ పంచాయతీ పరిధిలో కొత్త దుబ్బగూడ గ్రామానికి చెందిన బొయిరె రమేష్, చించోన్కర్ గణపతి, బొయిరె మల్లయ్య ముగ్గురిని చేపల వేటకు వెళ్తున్న సమయంలో అటవీ శాఖ అధికారులు ఎఫ్ఎస్ఓ అస్రొద్దీన్, బీట్ ఆఫీసర్ సాదిక్‌హుస్సేన్ అడ్డుకున్నారు. వన్యప్రాణులను చంపడం కోసం వెళ్తున్నారని అనుమానంతో ముగ్గురిని చితకబాది కేసు పెడుతామని బెదిరిస్తూ రూ.40 వేలు డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ పురుషోత్తంతో కలిసి మధ్యవర్తిగా ఉండి రూ.25 వేలు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆ డబ్బులు అధికారులకు అప్పగిస్తున్న క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు వీడియో తీయడంతో అది వైరల్ అయింది. ఈ విషయంపై ఎఫ్ఆర్ఓ అప్పలకొండ కొత్త దుబ్బగూడ గ్రామానికి వెళ్లి బాధితులను విచారించగా అటవీ శాఖ అధికారులు డబ్బులు తీసుకున్నట్టు రుజువు కావడంతో ఉన్నతాధికారులకు నివేదికలు పంపించడం జరిగిందన్నారు. ఉన్నతాధికారుల నుండి ఇద్దరు అటవీ శాఖ అధికారులను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్టు ఆయన పేర్కొన్నారు.

ఇంటర్మీడియట్ విద్యా అభివృద్ధికి కృషి

- జిల్లా నోడల్ అధికారి నైతం శంకర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఇంటర్మీడియట్ విద్యాభివృద్ధికి అధ్యాపకులు కృషి చేయాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి నైతం శంకర్ అన్నారు. జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు ముగిసిన నేపథ్యంలో తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్-475 సభ్యులు మర్యాదపూర్వకంగా ఆయనను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రశాంతంగా ఇంటర్మీడియట్ పరీక్షలు పూర్తి చేసినందుకు అధ్యాపకులకు అభినందనలు తెలిపారు. రానున్న రోజుల్లో కూడా ఇదే స్ఫూర్తితో వ్యవహరించాలని సూచించారు. కాంట్రాక్ట్ అధ్యాపకులు రెగ్యులర్ అయిన తర్వాత వచ్చిన మొదటి పరీక్షలు విజయవంతం కావడం సంతోషంగా ఉందన్నారు. నోడల్ అధికారిని సన్మానించిన వారిలో జీజేఎల్ఏ-475 రాష్ట్ర కోశాధికారి నాయిని శ్రీనివాస్, సంఘం జిల్లా అధ్యక్షుడు నవీన్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు లక్కాకుల సంతోష్, జిల్లా కమిటీ సభ్యులు అమరేందర్ రెడ్డి పాల్గొన్నారు.

15న వాహనాల వేలం పాట

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో వివిధ ఎక్సైజ్ కేసులలో పట్టుబడ్డ వాహనాలను ఈనెల 15న జిల్లా ఎక్సైజ్ అధికారి జ్యోతి కిరణ్ సమక్షంలో వేలంపాట నిర్వహించడం జరుగుతుందని ఎక్సైజ్ సీఐ దీపక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 15న ఉదయం 11 గంటలకు వేలంపాట ఉంటుందని, ఆసక్తి గల వారు వివరాల కోసం జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

తుంగెడ ప్రభుత్వ పాఠశాలకు ఫర్నీచర్ అందజేత



నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని తుంగెడ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు కుర్చీలు, ఫర్నీచర్‌ను కాగజ్‌నగర్ డివిజన్ మేనేజర్ స్రావణి తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గురువారం తుంగెడ హెచ్‌ఎం డి.లింగయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులందరు క్రమశిక్షణతో చదివి ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. కష్టపడి చదివితే దేనినైనా సాధించగలమన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు స్రావణిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు డి లింగయ్య మాట్లాడుతూ పాఠశాలకు తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఫర్నీచర్ అందజేయడం ఎంతో సంతోషకరమన్నారు. అనంతరం స్రావణికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ప్లాంటేషన్ మేనేజర్ లక్ష్మణ్, ప్లాంటేషన్ డిప్యూటీ మేనేజర్ దుర్గం రాకేష్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ఝాన్సీలక్ష్మి, ఉపాధ్యాయులు వనిత, ప్లాంటేషన్ వాచర్ గంగయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాజీ సీఎంకు జిల్లా నాయకుల పరామర్శ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రమాదవశాత్తు కాలు విరిగి విశ్రాంతి తీసుకుంటున్న మాజీ సీఎం కేసీఆర్‌ను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి జిల్లా నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా జిల్లాలో నెలకొన్న రాజకీయ పరిస్థితులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు కోసం సమిష్టిగా కృషి చేయాలని కేసీఆర్ సూచించినట్లు నాయకులు తెలిపారు. కేసీఆర్‌ను కలిసిన వారిలో ఎమ్మెల్యే కోవలక్ష్మి, జెడ్పీటీసీ నాగేశ్వరరావు, ఎంపీపీ మల్లికార్జున్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, బీఆర్ఎస్ నాయకులు గంధం శ్రీనివాస్, అబ్బుల, సుంకరి పెంటయ్య పాల్గొన్నారు.



ప్రభుత్వ ఆశ్రమ పాఠశాల సందర్శన

నవతెలంగాణ-జన్నారం



మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలను రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, కమిషన్ సభ్యురాలు కుస్రం నీలాదేవి గురువారం ఆకస్మికంగా సందర్శించి ఆశ్రమ పాఠశాల విద్యార్థులతో ముచ్చటించారు. అనంతరం పాఠశాల మౌలిక వసతుల కల్పనకు సంబంధించి, తరగతి గదుల, వంట గదులను, పిల్లల కోసం తీసుకొచ్చిన కూరగాయలు పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏటీడీఓ జోరంజీవి, డీటీడీఓ గంగారాం, పాఠశాల ప్రదానోపాధ్యయులు వెంకటేశ్వరులు, ఉపాద్యాయులు కాంతరావు, అనసూయ, రామ స్వామి, పంచాయతీ సెక్రెటరీ ఆత్రం జంగు, పెందుర్ లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్టులో విద్యార్థిని ప్రతిభ

నవతెలంగాణ-కాసిపేట



మండలంలోని ముత్యంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని ఐశ్వర్య టాలెంట్ టెస్ట్లో ప్రతిభ చాటింది. భారత విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో గత నెలలో నిర్వహించిన పదో తరగతి టాలెంట్ టెస్టులో అత్యుత్తమ ప్రతిభ కనభరిచి ఐశ్వర్య బహుమతి సాధించింది. ఈ మేరకు పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఐశ్వర్యకు ఆర్గనైజర్ దాగం శ్రీకాంత్, జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి బహుమతి అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పుష్పలత, బండ శాంకరి, జ్యోతి, అర్చన, పల్లె కృష్ణగోపాల్ రావు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-నస్పూర్

తెలంగాణ రాష్ట్ర స్టడీ సర్కిల్, మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో 2024-25 విద్యా సంవత్సరంలో యూపీఎస్సీ-సివిల్ సర్వీసెస్-2025 పరీక్షకు 100 మంది మైనార్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందించడం జరుగుతుందని, అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి నీరటి రాజేశ్వరి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్ లోని తెలంగాణ రాష్ట్ర మైనార్టీస్ స్టడీ సర్కిల్‌లో మొదటిసారి ప్రవేశం పొందే అభ్యర్థులు ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలని, ప్రవేశం పూర్తిగా మెరిట్ ప్రాతిపదికన ఉంటుందని, రిజర్వేషన్ల నియమం ప్రకారం మహిళా అభ్యర్థులకు 33.33 శాతం, అన్ని రిజర్వ్ కేటగిరీలో దివ్యాంగులకు 5 శాతం సీట్లు కేటాయించడం జరుగుతుందని తెలిపారు. సివిల్ సర్వీసెస్ ఆప్టిట్యూట్ టెస్ట్‌లో ప్రవేశం కోసం రాష్ట్రంలోని అన్ని జిల్లాలోని సాధారణ ప్రొఫెషనల్ డిగ్రీ పూర్తి చేసిన మైనార్టీస్ అభ్యర్థుల ద్వారా ఈ నెల 15 నుండి ఏప్రిల్ 12వ తేదీ వరకు టిఎంఆర్‌ఇఎస్‌తెలంగాణ.సిజిజి.జిఓవి.ఇన్ వెబ్సైట్ ద్వారా దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని, ఏప్రిల్ 28వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్డులో గల మైనార్టీ గురుకుల బాలికల పాఠశాలలో స్క్రీనింగ్ టెస్ట్ ఉంటుందని తెలిపారు. ఆసక్తి, అర్హత గల మైనార్టీ (ముస్లిం, క్రిస్టియన్, సిఖ్, జైన్, బుద్దిస్ట్, పార్శి) అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, వివరాలు ఆన్‌లైన్‌లో, 040-23236112 నంబర్లో సంప్రదించవచ్చని తెలిపారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేత



నవతెలంగాణ-నస్పూర్

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన పదవ తరగతి టాలెంట్ టెస్ట్-2024లో ప్రతిభ కనబరిచిన వారికి కార్మల్ కాన్వెంట్ హై స్కూల్‌లో గురువారం బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి దాగం శ్రీకాంత్ అధ్యక్షత వహించగా మంచిర్యాల విద్యాశాఖ అధికారి యాదయ్య, మండల విద్యా శాఖ అధికారి పోచయ్య, జిల్లా ఎస్ఓ సత్యనారాయణమూర్తి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి అతిథులుగా పాల్గొన్నారు. జిల్లా మొదటి బహుమతి మోడల్ స్కూల్ రాజీవ్ నగర్, సాయి వర్షిత, రెండవ బహుమతి శ్రీ చైతన్య హై స్కూల్ మంచిర్యాల కెవిన్, మూడో స్థానం కార్మెల్ కాన్వెంట్ హై స్కూల్ ముల్కల్ల హసిత, మంచిర్యాల పట్టణ కమిటీ మొదటి స్థానం సాయి రుచిత నారాయణ హై స్కూల్, రెండో బహుమతి శ్రీ చైతన్య హై స్కూల్ పవన్, మూడవ బహుమతి కృష్ణవేణి టాలెంట్ స్కూల్ సహస్ర, మంచిర్యాల జిల్లాలో ఉన్న పాఠశాలల టాపర్స్ తవ్వకల్ హైస్కూల్ అక్షయ, ఆర్బిహెచ్ హై స్కూల్ టాపర్ జి వైష్ణవి, కేజీబీవీ మంచిర్యాల స్కూల్ టాపర్ బత్తుల వైష్ణవి, స్ప్రింగ్ ఫీల్డ్ హై స్కూల్ రుత్విక్ సాయి బహుమతులు అందుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాలో పదో తరగతి కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు ఈదూనూరి అభినవ్, మాజీ అధ్యక్షుడు దూర్కె మోహన్ పాల్గొన్నారు.

భయం లేకుండా పరీక్షలు రాయాలి



నవతెలంగాణ-హాజీపూర్

పదవ తరగతి విద్యార్థులు భయం లేకుండా పరీక్షలు రాసి మంచి మార్కులు సాధించాలని ఎస్ఐ గోపతి సురేష్ అన్నారు. యువ తెలంగాణ యూత్ సభ్యుల ఆధ్వర్యంలో గురువారం సబ్బెపల్లి జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో పదవ తరగతి పరీక్షలు రాయబోయే 48 మంది విద్యార్థిని విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్, పెన్స్, స్కేలూ అందించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్‌కు పది పరీక్షలు ఎంతో ముఖ్యమైనవన్నారు. భవిష్యత్‌లో మంచి కోర్సు ఎన్నుకొని వుత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. యూత్ అధ్యక్షుడు దుర్గరాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధారాణి , పాఠశాల ఉపాధ్యాయ బృందం పద్మజ, నాగమణి రాజశేఖర్, మంజుల పాల్గొన్నారు.

పంచాయతీలో ఉచిత వైద్య శిబిరం



నవతెలంగాణ-తాండూర్

తాండూర్ పంచాయతీ ప్రాంగణంలో గురువారం ప్రత్యేక అధికారి ఎంపీడీఓ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్మిక శాఖ సౌజన్యముతో ఉదయం సీఎస్సీ ఆరోగ్య సంరక్షణ సంస్త అధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో లేబర్ కార్డ్ ఉన్న కార్మికులకు రక్త పరీక్షలు నిర్వహించారు. దాదాపుగా 30-40 రకాల రక్త పరీక్షలు ఉచితముగా చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ కూలీ పని చేసే కార్మికులు ఆరోగ్యం విషయంలో జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉందని తెలిపారు . ప్రతి కార్మికుడు లేబర్ కార్డ్ కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సిరంగి శంకర్, పంచాయతీ కార్యదర్శి తపాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎండీ ఈసా, సీఎస్సీ సిబ్బంది పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నవతెలంగాణ-మందమర్రి

పలు అభివద్ధి పనులకు గురువారం ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి శంకుస్థాపన చేసారు. మందమర్రి పట్టణంలోని పాత బస్టాండ్‌లో రూ.2 కోట్ల రూపాయల నిధులతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రభుత్వ విప్ నల్లాల ఓదేలు, గడ్డం వంశీ, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పది పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

● మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్

నవతెలంగాణ-నస్పూర్



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

జిల్లాలో ఈ నెల 18 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు నిర్వహించనున్న 10వ తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా పకడ్బందీగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. గురువారం కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో 10వ తరగతి పరీక్షల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తరగతి పరీక్షల నిర్వహణ కొరకు జిల్లాలో 52 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగందని, 9 వేల 637 మంది విద్యార్థినీ, విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. పరీక్షల నిర్వహణకు 52 మంది ముఖ్య పర్యవేక్షకులు, 52 మంది డిపార్ట్ మెంటల్ అధికారులు, 4 మంది సంరక్షకులు, 545 మంది ఇన్విజిలేటర్లను నియమించడం జరిగిందని, పరీక్షలలో ఎలాంటి మాస్ కాపీయింగుకు తావు లేకుండా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఇంటర్మీడియట్ పరీక్షల మాదిరిగా 10వ తరగతి పరీక్షలను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నిబంధనల మేరకు పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు శాఖ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేసి 144 సెక్షన్ అమలు చేయడంతో పాటు సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకునే విధంగా ఆర్‌టీసీ ద్వారా సమయానుకూలంగా బస్సులు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.యాదయ్య, మంచిర్యాల ఏసీపీ ప్రకాష్, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

సెక్టార్ అధికారులకు ఎన్నికలపై అవగాహన ఉండాలి

● జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్



నవతెలంగాణ-నస్పూర్

రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి, పోలింగ్ రోజు పాటించవలసిన నిబంధనలను ఎన్నికల అధికారులు పూర్తిగా తెలుసుకొని ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్లు బి.రాహుల్, సబావత్ మోతిలాల్, ఎల్ఎ, ఆర్ అండ్ ఆర్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డి.చంద్రకళతో కలిసి సెక్టార్ అధికారులు, సెక్టార్ పోలీసు అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బంధీగా నిర్వహించాలని, ఎన్నికల విధులు నిర్వహిస్తున్న సెక్టార్ అధికారులకు వారి విధులు, ఎన్నికల నియమావళి సంబంధిత ప్రతి అంశం తెలుసుకొని ఉండాలని తెలిపారు. ప్రతి సెక్టార్ అధికారి పరిధిలో కనీసం 3 నుండి గరిష్టంగా 12 పోలింగ్ కేంద్రాలు ఉంటాయని, ఆయా పోలింగ్ కేంద్రాలలో తాగునీరు, ర్యాంపు, నీడ, మూత్రశాలలు, కనీస మౌళిక సదుపాయాలు పరిశీలించి, ఏమైనా అవసరం ఉన్నట్లయితే సంబంధిత సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారుల దృష్టికి తీసుకువెళ్ళి సమకూర్చాలని తెలిపారు. సెక్టార్ అధికారులకు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలకు వెళ్ళే ప్రతి రూట్ తెలిసి ఉండాలని, పోలింగ్ రోజు ఈవీఎం, వీవీ ప్యాట్లలో సమస్య తలెత్తినట్లయితే వెంటనే తీసుకోవలసిన చర్యలు, పోలింగ్ రోజు గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నిర్వహించే మాక్ పోలింగ్ ప్రక్రియపై వివరించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, ఇతరత్రా సంబంధిత పరికరాల పంపిణీ సమయంలో పోలింగ్ కేంద్రాల వారిగా కేటాయించిన ప్రకారం వచ్చిన వాటి వివరాలను పరిశీలించాలని తెలిపారు. ఎలాంటి పొరపాట్లు జరిగినా భారత ఎన్నికల సంఘం నిబంధనల మేరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్ల ఏర్పాటు, పోలింగ్ రోజున ప్రతి 2 గంటలకు పోలింగ్ శాతం, పోల్ అయిన ఓట్ల వివరాల నివేదిక, పోల్ ముగిసే సమయానికి ముందుగానే వచ్చి ఉన్న ఓటర్ల విషయంలో పాటించవలసిన నిబంధనలు, ఓటింగ్ ప్రక్రియ ముగిసిన తరువాత గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల సీలింగ్, ఇతరత్ర అంశాలపై అవగాహన కల్పించడంతో పాటు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రం పని తీరును వివరించారు.

ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి

● రామగుండం సీపీ శ్రీనివాసులు

నవతెలంగాణ-మందమర్రి



పార్లమెంట్ ఎన్నికలలో ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని రామగుండం పోలీస్ కమీషనర్ ఎం శ్రీనివాసులు సూచించారు. గురువారం మందమర్రి పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్ పరిసరాలను రిసెప్షన్ సెంటర్‌లోని రికార్డులను పరిశీలించారు. అధికారులు, సిబ్బంది పని తీరును అడిగి తెలుసుకున్నారు. సర్కిల్ పరిధిలోని బౌగోలిక పరిస్థితులు, ఏజన్సీ ప్రాంతంలో వన్ సెవెంటీ (1/70) యాక్ట్ అమలవుతున్న తీరు, ఎలాంటి నేరాలు అధికంగా జరుగుతున్నాయి వాటిని ఏ విధంగా నియంత్రణ చేయాలి అనే అంశాలపై ప్రధానంగా చర్చించారు. ఫిర్యాదు దారులతో మర్యాదతో ప్రవరిస్తూ కేసుకు సంబంధించిన వివరాలను పూర్తిగా అడిగి జాప్యం చేయకుండా పరిష్కరించాలని సూచించారు. పెట్రోలింగ్ పకడ్బందీగా నిర్వహిస్తూ నేరాలను నియంత్రణ చెయ్యాలన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా ఉంటూ తమ విధులను క్రమశిక్షణతో నిర్వహించాలని తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నేరాలు అదుపు చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని అన్నారు. రాబోయే ఎన్నికల సమయంలో సమస్యలు సష్టించిన వారి పై పూర్తి నిఘా ఉంటుందని నేరస్తులు, రౌడీ షీటర్స్, సస్పెక్ట్ షీటర్స్, హిస్టరీ షీట్ ఉన్నవారిని బైండోవర్ చేయాలని తెలిపారు. ఎన్నికల సమయంలో కమ్యూనికేషన్ వ్యవస్థ అనేది చాల ముఖ్యమని పొలిటికల్ వైలెన్స్, భౌతిక దాడులు, గొడవలు సృష్టించే అవకాశం ఉన్న సోషల్ మీడియా సందేశాలు, వీడియోలు వైరల్ చేసే విషయాలు, సమస్యాత్మక ప్రాంతాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ప్రత్యేక దృష్టిసారించాలని పోలీసు అధికారులను అప్రమత్తం చేస్తున్నామన్నారు. ఎన్నికలలో ఎలాంటి అల్లర్లకు తావు లేకుండా ప్రజలంతా స్వచ్ఛందంగా స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకునే విదంగా వాతావరణాన్ని కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్, మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, మందమర్రి ఎస్ఐ రాజశేఖర్ పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు అవగాహనా సదస్సు



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని దేవాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సామాజిక చైతన్య వేదిక ఆధ్వర్యంలో గురువారం స్థానిక పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించారు. పరీక్షలపై, సమస్యలపై వ్యక్తిత్వ వికాస నిపుణుడు మద్దినేని అర్జున్ అవగాహన సదస్సులో పలు సూచనలు చేశారు. విద్యార్థులు పరీక్షలంటే భయపడవద్దని, ధైర్యంగా ముందస్తు ప్రణాళిక బద్ధంగా చదువుకోవాలని సూచించారు. పరీక్షల ముందు ఎలా చదువుకోవాలి, ఎలా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి పరీక్షలకు వెళ్లే ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు విద్యపై శ్రద్ధ పెట్టి చదువుకొని తల్లిదండ్రులకు పేరు తేవాలని పలు ఉదాహరణలతో విద్యార్థులకు తెలిపారు. జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలంటే చదువుపై నిర్లక్ష్యం పెట్టవద్దని, చదువుపై నిర్లక్ష్యం వహిస్తే జరిగే పరిణామాలను విద్యార్థులకు వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాథోడ్ రమేష్ మాట్లాడుతూ సామాజిక చైతన్య వేదిక నాయకులు తమ పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించడం పట్ల అభినందనలు తెలిపారు. విద్యార్థులు పరీక్షలో అత్యధిక మార్కులు సాధించి పాస్ అయ్యేందుకు ఇంపాక్ట్ ట్రైనర్ అర్జున్ విద్యార్థులకు విలువైన సూచనలు ఇచ్చారన్నారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బందితో ప్రధానోపాధ్యాయుడు రమేష్ మద్దినేని అర్జున్‌ను శాలువాతో సన్మానించారు. అనంతరం పరీక్ష ప్యాడులను, పెన్నులను పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో సామాజిక చైతన్య వేదిక అధ్యక్షుడు పల్లె మల్లయ్య, ప్రధాన కార్యదర్శి కొమ్ముల బాబు, ప్రధాన సలహాదారు మదినేని చిన్న భీమయ్య, పాఠశాల ఉపాధ్యాయులు దామోదర్‌రెడ్డి అంజాద్ పాషా, రాజేశం, పాల్గొన్నారు.

ఐబీ చౌరస్తాను అంబేద్కర్ చౌరస్తాగా మార్చడం హర్షణీయం

నవతెలంగాణ-నస్పూర్

మంచిర్యాల ఐబీ చౌరస్తాను డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చౌరస్తాగా పేరు మార్చడం హర్షించదగ్గ విషయమని జాతీయ మాల మహానాడు మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, ఉపాధ్యక్షుడు జింజుపల్లి నర్సింగ్, నియోజకవర్గ అధ్యక్షుడు కరిశ రామస్వామి, జిల్లా అధికార ప్రతినిధి పత్తి రామస్వామి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం మంచిర్యాల పురపాలక సమావేశంలో ఎన్నో ఏళ్లుగా ఉన్న మంచిర్యాల ఐబీ చౌరస్తాను డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చౌరస్తాగా మార్చడం చాలా సంతోషకర విషయమని, సమావేశంలో ఏకగ్రీవంగా ఆమోదించినందుకు మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్సాగర్ రావు, మున్సిపల్ ఛైర్మన్ ఉప్పలయ్య పాలక వర్గానికి జిల్లాలోని మాలలందరి తరపున కృతజ్ఞతలు తెలిపారు.

హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన

నవతెలంగాణ-జన్నారం

మండలంలో ప్రజలకు కళాకారులు కళాజాత ద్వారా గురువారం హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ డీఎంఅండ్ హెచ్ఐ ఆదేశాల మేరకు స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఆర్టీసీ బస్టాండులో జన జాగృతి కళాబృందం సభ్యులు హెచ్ఐవీ, ఎయిడ్స్ పై అవగాహన కల్పించారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ



నవతెలంగాణ-జైపూర్

భీమారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు గురువారం ఉచితంగా పరక్ష ప్యాడ్లు పంపిణీచేశారు. 10వ తరగతి ఇంగ్లీష్, తెలుగు మీడియం విద్యార్థులతో సమావేశమైన ప్రధానోపాధ్యాయులు విక్రమ్ కుమార్ పరిక్షల కోసం ఏవిధంగా సిద్ధం కావాలో తెలిపారు. అదేవిధంగా ఆరోగ్య పరమైన జాగ్రత్తలు తీసుకోవడం కూడా అవసరమే అని తెలిపారు. 40 మంది ఇంగ్లీష్ మీడియం, 37 మంది తెలుగు మీడియంలో 10వ తరగతి పరిక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు. గణితశాస్త్రం ఉపాధ్యాయులు విద్యార్థులకు ఉచితంగా పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తరగతి ఉపాధ్యాయులు పారిక్ అహ్మద్, తిరుపతి పాల్గొన్నారు.

ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ బహిరంగ క్షమాపణ చెప్పాలి

నవతెలంగాణ-జైపూర్

ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహారాజ్ పట్ల అనుచిత వాక్యలు చేసిన బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డీఎస్పీ నియోజకవర్గ నాయకులు రేగుంట రాకేష్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అగ్ర కులాల పార్టీలతో చేతులు కలిపి అపరమేధావి బహుముఖ ప్రజ్ఞశాలి విశారదన్ మహారాజ్‌ను విమ్మర్శించిన తీరును తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. అగ్ర కులాలతో చేతులు కలిపి 90 శాతం జనాభ కలిగిన బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రజలను మోసం చేయాలని చూస్తున్న తీరును తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు.

పద్మశాలి కార్పొరేషన్ ఏర్పాటు హర్షణీయం



నవతెలంగాణ-లక్షెట్టిపేట

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పద్మశాలి సంఘం కార్పొరేషన్ ఏర్పాటు చేయడం హర్షణీయమని పద్మశాలి సంఘం నాయకులు వేముల రాజగురువయ్య, బండి రాజలింగు అన్నారు. గురువారం స్థానిక ఆర్ అండ్ బీ విశ్రాంతి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హర్షం వ్యక్తం చేశారు. చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, మంచిర్యాల శాసనసభ్యులు ప్రేంసాగర్ రావు, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కమర్థపు మురళీలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రూ. ఐదు వేల కోట్ల నిధులు కేటాయించాలని కోరారు. అంతే కాకుండా స్థానిక ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావు ప్రతి గ్రామంలో తమకు సంఘ భవనాలు నిర్మించి నిరుపేద పద్మశాలిలకు ఉపాధి కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బైరి సత్యనారాయణ, బొప్పు కిషన్, వెంగలదాసు రాజు, నడిమెట్ల రాజన్న, కోమాకుల రవి, కోమాకుల రాము, ఆంకం రాజేశం, గుండ శోభన్, వేముల మల్లేష్, వేముల మధు, గాదాసు నరేష్, కట్ల శంకర్, హన్మండ్ల శంకర్, గంగుల లచ్చన్న, గుండు లక్ష్మణ్, మాటేటి రమేష్, కట్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు అందజేత



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని ముత్యంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు మోటివేషన్ చారిటిబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం ప్యాడ్లు, పెన్నులు అందించారు. ఎగ్జిక్యూటీవ్ సభ్యులు ప్రవీణ్ నాయక్, అర్చన చేతుల మీదుగా విద్యార్థులకు అందించి, 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పుష్పలత, బండ శాంకరి, పల్లె కృష్ణ గోపాల్‌రావు, జ్యోతి, మాధవి లత పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
శుక్రవారం | మార్చి 15, 2024 | www.navatelangana.com

ప్రశాంతంగా ముగిసిన పరీక్షలు

నవతెలంగాణ-సిర్పూర్(టీ)



ఇంటర్ మీడియట్ ద్వితీయ సంవత్సరం పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్టు చీఫ్ సూపరింటెండెంట్ రమేష్ తెలిపారు. గురువారం జరిగిన ద్వితీయ సంవత్సరం పరీక్షలో 243 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా ఒక్కరు మాత్రమే గైర్హాజరయ్యారు. విద్యార్థులకు పరీక్ష సమయంలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని మౌళిక సదుపాయాలు కల్పించామని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ

నవతెలంగాణ-లక్ష్మణచాంద



మండలంలోని కనకపూర్ గ్రామంలో రూ.20 లక్షలతో సీసీ రోడ్డు పనులను గురువారం ఎంపీపీ పద్మ రమేశ్, బీజేపీ నాయకులు భూమి పూజ చేశారు. నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి కృషితో రూ.20 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి మంజూరైనట్టు నాయకులు తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుక్కు ముత్తన్న, గాండ్ల చిన్నయ్య, వేణు గౌడ్, శ్రీను, రాజు, గ్రామస్తులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

డీమార్ట్ అనుమతులు రద్దు చేయాలి



నవతెలంగాణ-నిర్మల్

ప్రభుత్వ భూమిలో నిర్మించిన డీమార్ట్ అనుమతులు రద్దు చేయాలనీ, లేనిపక్షంలో పదివేల మందితో డీమార్ట్, కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని ఎమ్మెల్యే, బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 20న కలెక్టరేట్ ఎదుట నిరహాదీక్ష చేస్తామని తెలిపారు. వెంకటాపూర్‌లో ప్రభుత్వ, అసైన్డ్ భూములలో అక్రమాలపై చర్యలు తీసుకోవాలన్నారు. గాజులపేటలో శ్రీకృష్ణ దేవాలయానికి సంభంధించిన 8 ఎకరాల భూమి ఆక్రమణపై చర్యలు తీసుకోవాలన్నారు. డీ1 పట్టాల పేరుతో జరిగిన ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలనీ డిమాండ్ చేశారు. భూ అక్రమాలు చేసిన మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, కుటుంబ సభ్యులు, తన అనుచరులు ఎన్ని పార్టీలు మారిన, జిమ్మిక్కులు చేసిన విడిచి పెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. సొమ్ము ఒకరిది సోకు ఒకరిది అన్నట్టుగా రాష్ట్ర ప్రభుత్వ పనితీరు ఉందని విమర్శించారు. పసుపు క్వింట ధర రూ. 20వేలపై చీలుకు పలికిందని, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అందించిన సెంట్రల్ టర్మరిక్ బోర్డ్‌తోనే సాధ్యమైందని వెల్లడించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద కేంద్రం ఇందిరమ్మ ఇండ్లకు సాయం అందిస్తోందన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 15న మల్కాజ్‌గిరి, 16న నాగర్‌కర్నూలు, 18న జగిత్యాలలో ప్రధాని నరేంద్ర మోడీ పర్యటన ఉంటుందని తెలిపారు. సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

రైతులు ఆందోళన చెందొద్దు : ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సీసీఐ ద్వారా రైతుల నుండి కొనుగోలు చేసిన పంట నగదును పోస్టల్ అకౌంట్ ఉన్న రైతుల ఖాతాలో పడగా ఆ నగదును పోస్టల్ ఉద్యోగి జాధవ్ విజయ్ తన అకౌంట్‌లో మళ్లించుకున్న విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్ గురువారం రాత్రి పోస్టల్ కార్యాలయానికి రైతులతో కలిసి చేరుకొని అధికారులు, రైతులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వేలిముద్రలతో రైతుల ఖాతాల నుండి దాదాపు రూ.2 కోట్లకు పైగా ట్రాన్స్‌ఫర్ చేసుకున్నట్లు రైతులు ఆరోపిస్తున్నట్లు తెలిపారు. దీనిపై ఎస్పీ, పోస్టల్ అధికారులతో మాట్లాడినట్లు తెలిపారు. అలాగే పోస్టల్ హెడ్ ఆఫీస్ అధికారులు శుక్రవారం జిల్లాకు రావడం జరుగుతుందని, విచారణ జరుపుతారని స్పష్టం చేశారు. రైతులు ఎవరు కూడా ఆందోళన చెందవద్దని, మిగతా రైతులు కూడా ఒకసారి తమ అకౌంట్‌లను చెక్ చేసుకోవాలన్నారు.



కష్టపడి పండించిన పంట నగదును ఒక ఉద్యోగి కాజేయడం బాధాకరమన్నారు.

విద్యార్థులకు దిశానిర్దేశం చేయండి : డీఎంఅండ్ హెచ్ఓ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



పరీక్షలకు సన్నద్ధమైతున్న విద్యార్థులకు దిశా నిర్దేశం చేయాలని జిల్లాలోని వైద్యాధికారులను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ సూచించారు. గురువారం పరీక్షల సందర్భంలో మానసిక ఒత్తిడిని ఎదుర్కొనేందుకు విద్యార్థులు అనుసరించాల్సిన, పాటించాల్సిన విషయాలపై రిమ్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఓం ప్రకాష్ ఆధ్వర్యంలో వైద్యాధికారులకు జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి డా.నరేందర్ రాథోడ్ మాట్లాడుతూ పరీక్షలనేవి జీవితంలో ఒక భాగం మాత్రమేనని వాటికి భయపడి పిల్లలు ఆందోళన చెందవద్దని సూచించారు. పరీక్షలకు సన్నద్ధమయ్యే విద్యార్థులు సరైన ప్రణాళికతో ప్రిపరేషన్ కొనసాగించాలని, రోజు వ్యాయామం చేస్తూ ఉల్లాసంగా ఉండాలని, దానివలన ఒత్తిడి దూరం అవుతుందన్నారు. విద్యార్థులు వారికి సంబంధించిన పాఠ్యాంశాలలో అనుమానాలుంటే ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని సూచించారు. విద్యార్థుల్లో ఆత్మ స్థాయిని నింపేలా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని వైద్యాధికారులు ప్రత్యేకమైన చొరవ తీసుకొని వారికి అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మానసిక నిపుణులు డా.ఓం ప్రకాష్ మాట్లాడుతూ విద్యార్థుల్లోని పరీక్షలనే భయాన్ని పోగొట్టేలా వైద్యాధికారులు కౌన్సిలింగ్ ఇవ్వాలని సూచించారు. పరీక్షలు రాసేటప్పుడు ఆందోళనకు గురికాకుండా ఉండేలా వారికి సూచనలు చేయాలని కోరారు. పరీక్షల విధివిధానాలు ఎక్కువ మార్కులను పొందే కృషి చేసే పద్ధతులు పిల్లలకు తెలపాలని కోరారు. తద్వారా పరీక్షలు అంటే విద్యార్థులు ఉండే భయాన్ని తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసంక్రమిత వ్యాధుల నివారణ కార్యక్రమ అధికారి డాక్టర్ శ్రీధర్, మెడికల్ సైకాలజిస్ట్ శ్రీకాంత్, సోషల్ వర్కర్ చిరంజీవి పాల్గొన్నారు.

మాదిగ కార్పొరేషన్ ఏర్పాటు హర్షణీయం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇచ్చిన మాటకు అనుగుణంగా మాదిగ కార్పొరేషన్ ఏర్పాటు చేయడం హర్షనీయమని మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు మల్యాల మనోజ్ అన్నారు. గురువారం కలెక్టర్ చౌరస్తాలో సీఎం రేవంత్ రెడ్డి ఫ్లెక్సీకి పాలాభిషేకం నిర్వహించారు. కార్పొరేషన్ ప్రకటించడాన్ని స్వాగతిస్తూ ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కంటే ముందు మాదిగ కార్పోరేషన్ ఏర్పాటు చేస్తామని రేవంత్ రెడ్డి మాట ఇచ్చారని, ఇచ్చిన మాటకు కట్టుబడి మాదిగ కార్పొరేషన్ ఏర్పాటు చేయడం హర్షనీయమన్నారు. అదే విధంగా పార్లమెంట్ ఎన్నికల్లో రెండు రిజార్వు, ఒక జనరల్ స్థానాన్ని మాదిగలకు కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాదిగ జేఏసీ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మోతె బారికరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు నక్క రాందాస్, మహిళా సంఘం అధ్యక్షురాలు నాతరి సరోజా, జిల్లా కోశాధికారి లింగంపల్లి ప్రసన్నకుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి జువాక నర్సిములు, మాదిగ జేఏసీ జిల్లా నాయకులు పెద్దింటి ప్రసాద్, తారా రవికుమార్, కత్తి గంగాధర్, మహేందర్, భూమన్నబట్టు మహేందర్ ఉన్నారు.

కలెక్టర్‌ను కలిసిన సుహాసినిరెడ్డి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా నూతన కలెక్టర్ రాజర్షి షాను కలెక్టర్ కార్యాలయంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, మాజీ జిల్లా పరిషత్ చైర్పర్సన్ సుహాసిని రెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి, శాలువతో సన్మానించారు. అనంతరం కుమురం కాలనీ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆదివాసీ సంఘాల నాయకులు, కాలనీ వాసులతో వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని ఇందిరమ్మ కాలనికి వెళ్ళే దారిలో గల పశువధశాల వల్ల కాలనీ వాసులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి వివరించి దానిని వేరే చోటకి తరలించాలని కోరారు. కేఆర్కే కాలనిలో మరుగుదొడ్లు లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులను గురించి తెలియజేశారు. సమస్యలపై కలెక్టర్ సానుకూలంగ స్పందించారని సుహాసిని రెడ్డి తెలిపారు.

సైనిక్ పాఠశాలకు సహస్ర ఎంపిక

నవతెలంగాణ-బోథ్



మండల కేంద్రానికి చెందిన విద్యార్థి బైరి సహస్ర సైనిక్ పాఠశాలకు ఎంపికైంది. 6వ తరగతి ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ఎంట్రన్స్ ఎగ్జామ్స్-2024లో నాగభూషణం మెమోరియల్ హైస్కూల్‌కి చెందిన 5వ తరగతి విద్యార్థి బైరి సహస్ర ఉత్తమ ప్రతిభను కనబరిచింది. ప్రవేశ ఫలితాలలో 300 మార్కులకు గాను 224 మార్కులు పొంది ఆల్ ఇండియాలో 16832 సాధించింది. ఈ విద్యార్థి ఆల్ ఇండియాలో ర్యాంకు సాధించినందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కిషోర్, తల్లిదండ్రులు, గ్రామస్తులు, అభినందించారు.

నేటి నుండి ఒంటిపూట బడులు ప్రారంభం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఒంటిపూట తరగతులు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయని ఆదిలాబాద్ విద్యాశాఖాధికారిని ప్రణీత గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాల వరకు తరగతులు కొనసాగుతాయని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలతో పాటు అన్ని ఎయిడెడ్, ప్రయివేట్ పాఠశాలలు ఈ నిబంధనలు పాటించాలన్నారు. ఈనెల 18 నుంచి 10వ తరగతి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పరీక్ష కేంద్రాలున్న పాఠశాలలు మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం 12.30 గంటల నుంచి అమలు చేస్తామని, భోజనం తరువాతే పిల్లలను ఇంటికి పంపిస్తామని పేర్కొన్నారు.

మూతపడిన గనులను పరిశీలించిన ప్రొఫెసర్



నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాలో మూతపడిన గనులను గురువారం కార్పొరేట్ ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ అధికారులతో కలిసి సిగ్‌పూర్ ప్రొఫెసర్ డాక్టర్ సుదీప్త మహోపాధ్యాయ్ గురువారం అధికారులతో కలిసి పరిశీలించారు. జీఎం కార్యాలయంలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మూతపడిన గనులు, ఇనిస్టీ ఆఫ్ కోల్ నియమాలు, తాత్కాలిక గనుల మూసివేత ప్రణాళికలను వివరించారు. అనంతరం మూతపడిన ఎంవీకే/ బోయపల్లి గనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఏరియా జీఎం డి.రవిప్రసాద్, ప్రాజెక్టు అధికారులు ఉమాకాంత్, ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ అడిషనల్ మేనేజర్ వెంకటరమణ, సర్వే అధికారి కార్పొరేట్ నరేష్, డీజీఎం(ఈఅండ్ఎం) ఏరియా వర్క్‌షాప్ కృష్ణమూర్తి, డీపీఏ ఓసీటు మేనేజర్ మహేష్ పాల్గొన్నారు.

ముగిసిన భరంపూర్ జాతర



నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని భరంపూర్ జాతర గురువారం ముగిసింది. భరంపూర్ కొండపై వెలసిన శ్రీవెంకటేశ్వర కళ్యాణ మహోత్సవం గురువారం చివరి రోజు భక్తుల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివిధ మండలాల నుండి భక్తులు పాల్గొన్నారు. గత సంవత్సరం లడ్డు వేలం వేయగా రూ.లక్ష వెయ్యి పలికింది. ఈ సంవత్సరం ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన పాముల శ్రీనివాస్ రూ.లక్ష 7వేల లడ్డులు దక్కించుకున్నారు. రథోత్సవ కార్యక్రమంలో వివిధ మండలాలతో పాటు మహారాష్ట్ర నుండి అధిక సంఖ్యలో పాల్గొన్నారు. రథోత్సవ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ దామోదర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసిని రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ ముడుపు కేథరేశ్వర్ రెడ్డి, గోపాలకృష్ణ మఠం పీఠాధిపతి యోగనంద సరస్వతి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సాంస్కృతిక అవార్డు పొందిన జెఎల్

నవతెలంగాణ-కడెం

రాష్ట్ర ట్రాన్స్‌కో డిస్కం నిర్వహించిన రాష్ట్రస్థాయి స్పోర్ట్స్, అథెంటిక్స్, సాంస్కృతిక కార్యక్రమాలు మూడు రోజులుగా యాదగిరిగుట్టలో నిర్వహించారు. దానిలో భాగంగా 33 జిల్లాల్లోని 150 మంది రాష్ట్ర స్థాయిలో పాటల పోటీలో పాల్గొనగా పురుషుల విభాగంలో రాష్ట్రస్థాయిలో మూడవ బహుమతిని కడెంకు చెందిన జూనియర్ లైన్‌మెన్ అగ్గిమెట్ల మహేష్ గెలుపొందారు. 33 జిల్లాలు పాల్గొన్న పోటీల్లో రాష్ట్రస్థాయిలో మూడో స్థానం సాధించిన జూనియర్ ఆయన్ను కడెం ఏఈ సుమన్ కుమార్ అభినందించారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



నవతెలంగాణ-బేల

మండలం కేంద్రంలోని కీర్తన డిగ్రీ కాలేజీకు సంబంధించిన గోడ ప్రతులను విద్యార్థుల సమక్షంలో కళాశాల ప్రాంగణంలో గురువారం ఆవిష్కరించారు. ఇంటర్ పరీక్షలు ముగిసిన సందర్భంగా వచ్చే విద్యా సంవత్సరం డిగ్రీకి సంబంధించిన గోడ ప్రతులు, క్యాలెండర్, కరపత్రాలను జైనథ్, బేల పరీక్ష కేంద్రం వద్ద అధ్యాపకులు విద్యార్థులకు పంపిణీ చేశారు. గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుండి డిగ్రీ జర్నలిసం కోర్స్, బీకామ్‌లో ఇన్సూరెన్స్ వంటి కోర్సులతో పాటు బీఏ, బీఎస్సీ లాంటి కోర్సులతో పాటు ఆదనపు కరికులం అనుభవం అర్హత కలిగిన అధ్యాపకులుతో పాటు అనుభవం ఉన్న ప్రిన్సిపాల్ ఉన్నారన్నారు. కీర్తన కాలేజీని రాబోయే దోస్త్ అడ్మిషన్లలో మొదటి ఆప్షన్‌గా ఎంచుకోవాలని ప్రిన్సిపల్ డాక్టర్ వరప్రసాద్ రావు కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ గెడం ప్రవీణ్, సీనియర్ అధ్యాపకులు పుష్ప, ఆమోల్, సాగర్, కిష్టారెడ్డి, బిందు పాల్గొన్నారు..

విద్యారంగంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

విద్యారంగం పైన ప్రభుత్వం దృష్టి పెట్టాలని, విద్యారంగాన్ని గత ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసిందని విద్యార్థి సంఘాల జేఏసీ నాయకులు ఆత్రం నగేష్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పెండింగ్‌లో స్కాలర్షిప్స్, ఫీజు రీయింబర్స్మెంట్ తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టళ్లలో చదువుకునే విద్యార్థులకు మెస్, కాస్మొటిక్ ఛార్జీలు పెంచాలనీ, యూనివర్సిటీలు, అనుబంధ కళాశాలల్లో మెస్ ఛార్జీలు పూర్తిగా ప్రభుత్వమే భరించాలనీ పేర్కొన్నారు. పెండింగ్ లో ఉన్న 9 నెలల కాలం డైట్ బిల్లులు తక్షణమే విడుదల చేయాలనీ, ఇది ప్రభుత్వ సంక్షేమ వసతి గహాల్లో రెగ్యులర్ మెనూ ప్రకారం భోజనం పెట్టాలన్నారు.

మా కళాశాలలో చేరండి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరితే తమ భవిష్యత్ బంగారు బాటలో నడుస్తుందని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ అనిత అన్నారు. గురువారం తమ కళాశాలలో అడ్మిషన్స్ కోసం అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాల వద్ద ప్రభుత్వ కళాశాలలోని సౌకర్యాలను వివరిస్తూ విద్యార్థులకు కరపత్రాలను పంపిణీ చేశారు. తమ కళాశాలలో ఉన్న సౌకర్యాల గురించి, కోర్సుల గురించి వివరించారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లోనే అన్నిరకాల వసతులుంటాయని నీట్, సెట్, పీహెచ్‌డీ అర్హతలున్న వారే అధ్యాపకులుగా పనిచేస్తున్నారన్నారు. విద్యార్థుల ప్రగతికి ప్రభుత్వ కళాశాలలే తోడ్పాటును అందించగలవని, అడ్మిషన్లు పెంచడం కోసం అధ్యాపకులు అంతా సమిష్టిగా కృషిచేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

కార్యకర్తలకు సరైన గౌరవమివ్వాలి



నవతెలంగాణ-నార్నూర్

కాంగ్రెస్‌లో పని చేస్తున్న కార్యకర్తలకు సరైన గౌరవం ఇవ్వాలని ఆ పార్టీ కార్యకర్తలు కోరారు. మండల కేంద్రంలో గురువారం సమావేశం నిర్వహించి మండల కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. 10 మంది పార్టీ కార్యకర్తల పేరును ఖరారు చేసి ఎంపీటీసీ అబేదా ఖానామ్‌కు వినతిపత్రం అందజేశారు. ఇన్‌చార్జ్ మంత్రి సీతక్క, ఆదిలాబాద్, ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షులకు వివరించి కార్యకర్తలకు న్యాయంగా ప్రెసిడెంట్‌తో పాటు బాడీలో ఉన్న వారికి గౌరవం ఇవ్వాలని కోరారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్యే బొజ్జు



నవతెలంగాణ-ఉట్నూర్

హైదరాబాదులోని సెక్రటేరియట్‌లో సీఎం రేవంత్ రెడ్డిని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ బుధవారం రాత్రి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆదివాసీ, లంబాడా కార్పొరేషన్‌లను ఏర్పాటు చేయడం పట్ల సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించి, నివేదికలను సమర్పించారు. ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో ఖానాపూర్ పట్టణ కేంద్రంలో ప్రేమ పేరిట జరిగిన అలేఖ్య హత్య కేసు ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా త్వరగా న్యాయ విచారణ జరిపించి, అలేఖ్య కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.

గ్రామాల్లో కొనసాగుతున్న కుష్టు గుర్తింపు సర్వే



నవతెలంగాణ-నార్నూర్

గ్రామాల్లో కుష్టు వ్యాధి గుర్తింపు సర్వే ముమ్మరంగా కొనసాగుతోంది. గురువారం మండలం కేంద్రంలోని విజయ్ నగర్ కాలనీలో వైద్య సిబ్బంది ఇంటింటికి తిరుగుతూ కుష్టు వ్యాధి గుర్తింపు సర్వే నిర్వహించారు. ప్రజలకు అవగాహన కల్పిస్తూ శరీరంపై పాలిపోయిన రాగి రంగు గల మొద్దుబారిన మచ్చలు ఉంటే కుష్టుగా అనుమానించి పీహెచ్‌సీలో సంప్రదించి పరీక్షలు చేయించాలని నోడల్ అధికారి చరణ్ దాస్ సూచించారు. ఆయన వెంట హెల్త్ అసిస్టెంట్ ఈశ్వర్, వైద్య సిబ్బంది జ్యోతి ఉన్నారు.

ఘనంగా పోచమ్మ ఆలయ వార్షికోత్సవం

నవతెలంగాణ-కడెం

మండలంలోని ధర్మాజీపేట్ గ్రామ పంచాయతీ పరిధిలోని కుర్రగూడెం గ్రామంలో పోచమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోచమ్మ బోనాల పండుగ ఉత్సవాలు గురువారం మధ్యాహ్నం కన్నుల పండుగ నిర్వహించారు. గ్రామంలోని మహిళలు ఉపవాసలతో బోనాలు వండుకొని డప్పుచప్పులు వాయిద్యాల మధ్య ఊరేగింపుగా పోచమ్మ ఆలయానికి చేరుకొని పోచమ్మ తల్లికి బోనాలు, నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పోచమ్మ తల్లి బోనాల ఉత్సవాలతో గ్రామంలో పూర్తిగా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

అభివృద్ధి పనులకు భూమిపూజ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

మండలంలోని భీంసరి గ్రామంలో ఎఫ్‌ఎఫ్‌సి నిధులు రూ.1.33లక్షలతో సీసీ డ్రైన్ నిర్మాణానికి ఎంపీటీసీ బిక్కి గంగాధర్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. మహిళలకు ఫ్రీ బస్సు, 200 యూనిట్ల వరకు విద్యుత్ చార్జీలు, మాఫీ, రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తోందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అంబదాస్, మేకల గంగాధర్, గ్రామస్తులు రాజేశ్వర్, సుభాష్, అనిల్, శ్రీకాంత్, గంగన్న, శ్రీను, వామన్, గంగన్న పాల్గొన్నారు.

మాజీ ముఖ్యమంత్రిని కలిసిన ఎంపీపీ



నవతెలంగాణ-రెబ్బెన

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను గురువారం హైదరాబాద్‌లో ఎంపీపీ జుమ్డి సౌందర్య ఆనంద్ ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

రిమ్స్‌లో కిడ్నీ దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రిమ్స్ ఆస్పత్రిలోని డయాలసిస్ కేంద్రంలో కిడ్నీ దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ పాల్గొని కేక్ కట్ చేశారు. డయాలసిస్ రోగులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ తానాజీ, డయాలసిస్ ఇన్‌చార్జి ప్రేమ్ దాస్, సిబ్బంది చరణ్, రామకృష్ణ కార్తిక్, ఇర్షాద్, ఫోజియా పాల్గొన్నారు.

పంచాయతీ లేఅవుట్ వెంచర్లకు అనుమతివ్వాలి

నవతెలంగాణ-కాసిపేట

గ్రామ పంచాయతీ లే అవుట్ వెంచర్లకు ప్రభుత్వం అనుమతి ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర రియల్టర్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ కర్ణ శ్రీధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేషనల్ హైవేకు, ఇతర పరిశ్రమలకు, జిల్లా కేంద్రాలకు దగ్గరగా ఉన్న గ్రామాల పరిధిలో మధ్య, దిగువ మధ్య తరగతి ప్రజలు ప్లాట్స్ కొనుగోలు చేయడానికి ముందుకు వస్తున్నారని, గ్రామ పంచాయతీ పరిధిలోని వెంచర్లకు డీటీసీపీ లే అవుట్ ఏర్పాటు చేస్తే అవి మధ్య తరగతి ప్రజలకు ధర అందుబాటులో ఉండవని, కొనుగోలు చేయలేరని, వెంటనే పంచాయతీ లే అవుట్‌కు అనుమతి ఇవ్వాలని పేర్కొన్నారు.

రాష్ట్రంలో అరాచక పాలన : ఈశ్వర్



నవతెలంగాణ-కాసిపేట

రాష్ట్రంలో ఆరాచక పాలన నడుస్తుందని, ఈ విషయాన్ని ప్రజలను చైతన్యం చేసి, వాస్తవాలను ప్రజలకు వివరించాలని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు మాజీ మంత్రి, పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ముత్యంపల్లిలో పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యతో కలిసి మాజీ మంత్రి, ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ హాజరై మాట్లాడారు. ఎన్నికలు మనకు ఎంతో ప్రతిష్టాత్మకమని, బీఆర్ఎస్ ఎంపీ ఎన్నికల్లో గెలవాల్సిన అవసరముందన్నారు. బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పని చేసి గెలిపించుకోవాలని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని పోగొట్టుకున్నామని ప్రజలు బాధపడుతున్నారన్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పని చేయడానికి సిద్ధంగా ఉన్నారని, బీఆర్ఎస్ గెలుస్తుందన్నారు. అనంతరం బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య మాట్లాడుతూ ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలన్నారు. ఎంపీ ఎన్నికల్లో అత్యధిక సీట్లు గెలిపించుకోవాలన్నారు. ప్రజలకు వాస్తవాలు వివరించాలని, మన ప్రభుత్వంలో ఎన్ని సంక్షేమ పథకాలు, అభివృద్ధి చేశామని వివరించి, ఇప్పుడు ఏం జరుగుతుందో ప్రజలకు తెలియజేసి ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పల్లె చంద్రయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొల్లు రమణారెడ్డి, సహకార చైర్మన్ నీలా, ఎంటీసీలు చంద్రమౌళి, కొండబత్తుల రాంచందర్, అక్కెపల్లి లక్ష్మీ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఏనుగు మంజులారెడ్డి, మోటూరి వేణు, తిరుపతి రెడ్డి, అనంతరావు, అగ్గి సత్తయ్య, అట్టెపల్లి శ్రీనివాస్, పిట్టల సుమన్, చింతల భీమయ్య, బోయిని తిరుపతి, రాంటెంకి వాల్దేవ్, జాడి రాంచందర్, ఆడె జంగు, అజ్మీర తిరుపతి, పెంద్రం హన్మంతు, ఆడె శంకర్, దుర్గం సాగర్, ఎదుల అంజయ్య పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ముదిరాజ్‌ల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ముదిరాజ్ ఉపాధ్యక్షులు బొజ్జ నారాయణ, జిల్లా అధ్యక్షులు సలేంద్ర శివయ్య, మండల అధ్యక్షులు జుంగల భోజన్న, నాయకులు యామ ముత్యం, నాయుడు శ్రీను, గొండ్ల రమణ, బొజ్జ సాయన్న పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు పూర్వ వైభవం తీసుకురావాలి



నవతెలంగాణ-తాండూర్

కార్యకర్తలు కష్టపడి పనిచేసి బీఆర్ఎస్‌కు పూర్వ వైభవం తీసుకురావాలని పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ కోరారు. గురువారం మండలంలోని రేచీని గ్రామంలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కార్యకర్తలు కష్టపడి పని చేసి గెలుపుకు కృషి చేయాలన్నారు. బూటకపు మాటలు తప్పుడు వాగ్దానాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వ విధివిధానాలను ప్రజలు గ్రహిస్తున్నారన్నారు. ప్రతి కార్యకర్త కాంగ్రెస్ అసత్యపు వాగ్దానాలను వేలెత్తి చూపుతూ బీఆర్ఎస్ చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దత్తు మూర్తి, ఎంపీపీ పూసాల ప్రణయ్ కుమార్, సీనియర్ నాయకులు దత్తాత్రేయ రావు, రహమత్ ఖాన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీ ఫెడరేషన్ కులాల సమితి జిల్లా అధ్యక్షునిగా నగేష్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ బీసీ ఫెడరేషన్ కులాల సమితి జిల్లా అధ్యక్షునిగా గుడిపల్లి నగేష్ నియమితులయ్యారు. ఈ మేరకు సమితి రాష్ట్ర అధ్యక్షుడు దుర్గారావు, ప్రధాన కార్యదర్శి కీర్తి యుగంధర్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. తనను సమితి జిల్లా అధ్యక్షుడుగా నియమించినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, సమితి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులకు నగేష్ కృతజ్ఞతలు తెలిపారు.

ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

10వ తరగతి విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికిలోను కాకుండా పరీక్షలు రాయాలని జిల్లా విద్యాశాఖ అధికారిణి ప్రణీత సూచించారు. 10వ తరగతి వార్షిక పరీక్షల నేపథ్యంలో పట్టణంలోని ప్రభుత్వ గెజిటెడ్ నెం.1 పాఠశాలను గురువారం ఆమె సందర్శించారు. పదవ తరగతి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. పరీక్షలను ప్రశాంతమైన వాతావరణంలో రాసేందుకు విద్యార్థులు సిద్ధం కావాలని డీఈఓ సూచించారు.

నేటి నుంచి ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

నవతెలంగాణ-ఇచ్చోడ

రాష్ట్ర ప్రభుత్వం ద్వారా పశువైద్య శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నట్లు మండల పశు వైద్యాధికారి గోవింద్ నాయక్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని పశు వైద్యశాలలో విలేకరులతో మాట్లాడారు. వేసవికాలంలో పశువులు గాలికుంటు వ్యాధి బారిన పడకుండా ఉండేందుకు ముందస్తు చర్యలో భాగంగా అన్ని గ్రామాల్లో గాలికుంటు నివారణ టీకాలు వేస్తామని పేర్కొన్నారు. పశుయజమానులు అందుబాటులో ఉండి సహకరించాలని కోరారు. ఏప్రిల్ 5న వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు.

యాంత్రీకరణతో రైతులకు మేలు



నవతెలంగాణ-నిర్మల్

వ్యవసాయ రంగంలో యాంత్రీకరణను ఉపయోగించుకోవడం వల్ల రైతులకు ఎంతో మేలు కలుగుతుందని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. గురువారం కలెక్టరేట్ ప్రాంగణంలో ఇండియన్ ఫార్మర్స్ ఫర్టిలైజర్ కో ఆపరేటివ్ లిమిటెడ్ (ఇఫ్కో) వ్యవసాయ డ్రోన్‌ను ప్రారంబించారు. నానో యూరియా, నానో డీఏపీ వంటి ఎరువులను సులభతరంగా పిచికారీ చేసుకోవచ్చని తెలిపారు. మహిళా సాధికారితను సాధించటంలో భాగంగా మహిళలకు వంద శాతం రాయితీతో ఈ డ్రోన్‌లను అందించడం అభినందనీయమన్నారు. గ్రామీణ యువత, మహిళలు, మహిళా సంఘాలకు ఉపాధి కల్పించాలన్న ఉద్దేశ్యంతో ఈ డ్రోన్‌లను సమకుర్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్, ఇఫ్కో ఎఫ్ఓ వికాస్, ఎస్ఎఫ్ఏ సాగర్, నవీన్, అధికారులు పాల్గొన్నారు.

16న వైద్య కళాశాలలో వాక్ ఇన్ ఇంటర్వ్యూ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వ వైద్య కళాశాలలో ఒప్పంద, గౌరవ వేతన పద్ధతిన వివిధ విభాగాలలో పని చేసేందుకు అర్హత గల అభ్యర్థులకు ఈ నెల 16న వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించడం జరుగుతుందని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ నాగార్జున చారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రొఫెసర్స్-22, అసోసియేట్ ప్రొఫెసర్స్-27, అసిస్టెంట్ ప్రొఫెసర్స్-48, సీనియర్ రెసిడెంట్స్-27 విభాగాలలో అనాటమీ, ఫిజియాలజీ, బయో కెమిస్ట్రీ, ఫార్మకాలజి, పాథాలజీ, మైక్రోబయాలజీ, ఫోరం సిక్ మెడిసిన్, కమ్యూనిటీ మెడిసిన్, జనరల్ మెడిసిన్, పీడియాట్రిక్స్, డెర్మటాలజీ, వెనరాలజీ, సైకియాట్రి, జనరల్ సర్జరీ, ఈఎన్‌టి, ఆప్తాల్మలజీ, ఆర్థోపెడిక్స్, అబ్స్టెట్రిక్స్, గైనకాలజీ, అనస్తీసియా, రేడియాలజీలలో అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు స్వీయ ధ్రువీకరణ ప్రతులను జతపరిచి ఈనెల 16న ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో నిర్వహించు వాక్ ఇన్ ఇంటర్వ్యూకు హాజరుకావాలని తెలిపారు. వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.జీఎంసీకుమురంభీంఆసిఫాబాద్.ఓఆర్‌జీని సంప్రదించవచ్చని సూచించారు.

స్టడీ మెటీరియల్ అందించేందుకు దరఖాస్తులు

నవతెలంగాణ-నస్పూర్

పాఠశాల విద్యాశాఖ జారీ చేసిన ఉపాధ్యాయుల (ఎస్.జి.టి., స్కూల్ అసిస్టెంట్) నియామకం కోసం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని వెనుకబడిన తరగతులకు చెందిన అభ్యర్థులకు బుక్ ఫండ్, స్టడీ మెటీరియల్ ఖర్చులను అందించేందుకు దరఖాస్తులు చేసుకోవాలని బీసీ వెల్ఫర్ అధికారి వినోద్ కుమార్, బీసీ స్టడీ సర్కిల్ ఆదిలాబాద్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. 10 వేల మంది బీసీ అభ్యర్థులకు (7 వేల మంది ఎస్.జి.టి., 3 వేల మంది స్కూల్ అసిస్టెంట్) రూ. 1500 చొప్పున అందించడం జరుగుతుందని, అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.5 లక్షల రూపాయల లోపు ఉండాలని, స్కూల్ అసిస్టెంట్‌కు సంబంధించి గ్రాడ్యుయేషన్, బీఎడ్, టెట్, ఎస్జీటీలకు సంబంధించి ఇంటర్మీడియట్, డైట్, టెట్‌లో సాధించిన మార్కుల ఆధారంగా ప్రతిభావంతులైన అభ్యర్థులను ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. వివరాలకు 08732-221280, 9949684959 నంబర్‌లలో సంప్రదించాలన్నారు.

అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉంటాం

నవతెలంగాణ -ముథోల్

బీజేపీ కేంద్ర నాయకత్వం పార్లమెంట్ ఎన్నికల్లో తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా ఎన్నికల్లో పని చేస్తామని ఆ పార్టీ జిల్లా సహా కోశాధికారి, ఎంపీటీసీ దేవోజి భూమేష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానానికి అధిష్టానం బిజెపి అభ్యర్థిగా జి. నగేష్‌ను ప్రకటించిందన్నారు. అధిష్టానం ప్రకటించిన అభ్యర్థికి మద్దతుగా ఎన్నికల్లో ఎమ్మెల్యే రామారావు పటేల్ నాయకత్వంలో గెలుపు కోసం కృషి చేస్తామని చెప్పారు. పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఎన్నికల్లో భారీ మెజారిటీ తీసుకురావడానికి ప్రయత్నిస్తామన్నారు. ఆయన వెంట మాజీ సర్పంచులు స్వర్ణలత దత్తాత్రి, నిమ్మ పోతన్న, నాయకులు అంబర్‌సింగ్ పాల్గొన్నారు.